PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 223 | విజయవాడ, గురువారం 16 మార్చి 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 16 March 2023 | Rs

కాంట్రాక్టు పద్ధతిలోనే
- డిఎస్‌సి-1998 అభ్యర్థులకు పోస్టింగ్
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

లోపలి పేజీలో..


ప్రతిపక్షాల సభ్యులను అడ్డుకునేందుకు పార్లమెంట్ వద్ద భారీ సంఖ్యలో మోహరించిన బలగాలు

రోల్ మోడల్‌గా రాష్ట్రం

విద్య, వైద్య రంగాల్లో భారీ సంస్కరణలు
వికేంద్రీకరణతో పాలనా వ్యవస్థలో మార్పులు
2024లోనే ఎన్నికలు : సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి కనబడుతుందని, గ్రోత్ రేటులో మన రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా నిలిపామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జిడిపి గ్రోత్ రేటు 11.23 శాతానికి పెంచామన్నారు. వృద్ధులు, వితంతువులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచిన అనంతరమే ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. 'నా నడక మాత్రం నేలపైనే.. నా ప్రయాణం మాత్రం సామాన్యుడితోనే.. నా ప్రయాణం మాత్రం పేదవర్గాలతోనే.. నా యుద్ధం పేదలను దోచుకునే ఈ పెత్తందారులతోనే.. నా లక్ష్యం పేదరిక నిర్మూలనే.. పేద కుటుంబాలు ఆర్థికంగా బలపడితేనే బలమైన సమాజం ఏర్పడుతుంది. అన్ని ప్రాంతాలూ, అన్ని వర్గాలూ బలపడితేనే రాష్ట్రం బాగుంటుంది. ఇదే నేను నమ్మిన సూత్రం. ఇదే నా ఎకనామిక్స్' నా తండ్రి వైఎస్‌ఆర్‌ను చూస్తూ నేర్చుకున్న పాలిటిక్స్.. ఇవన్నీ కలిస్తేనే మీ జగన్' అంటూ గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సిఎం జగన్ బుధవారం భావోద్వేగ ప్రసంగం చేశారు. పాలనలో పారదర్శకత తీసుకొచ్చేలా తన మూడు సంవత్సరాల 9 నెలల పాలనలో రాజకీయ వ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకొచ్చామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.5 శాతం అమలు చేసి చూపించామన్నారు. ఎన్నికల వరకే రాజకీయం, ఆ తర్వాత అందరూ మన వాళ్లేననే అభిప్రాయంతో ముందుకు సాగుతున్నామన్నారు. వికేంద్రీకరణలో భాగంగా పరిపాలనను ప్రజలకు చేరువ చేసే ప్రక్రియలో 51 రెవెన్యూ డివిజన్లను 76కు పెంచామని, 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు



ఏర్పాటు చేసి 1.34 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించామని సిఎం వెల్లడించారు. గ్రామ సచివాలయాల ద్వారా గ్రామ స్థాయిలో 600 పౌర సేవలందిస్తున్నామని, సచివాలయాలకు అనుబంధంగా మరో 2.65 లక్షల మంది గ్రామ వాలంటీర్లు పనిచేస్తున్నారని, పౌర సేవల్లో ఇదొక విప్లవమన్నారు. డిబిటి ద్వారా రూ.1,97,473 కోట్లు లబ్ధిదారులకు అందించామని, గడప గడపకు ఎమ్మెల్యేలు వెళ్లి తమ ప్రభుత్వం చేసిన మంచి పనిని చెప్పుకుంటూ ఆశీర్వదించమని అడుగుతున్నామన్నారు. 5.5 కోట్ల మంది ఉన్న రాష్ట్రంలో కేవలం 4 లక్షల మంది ఉన్న ఉద్యోగులను 6 లక్షలకు పెంచామని, ఎంఎస్‌ఎంఇ సెక్టారులో ఉద్యోగ కల్పన చేశామని, గతంలో 1.10 లక్షల ఎంఎస్‌ఎంఇలు ఉంటే తమ ప్రభుత్వం మరో 1.56 లక్షల ఎంఎస్‌ఎంఇలకు తీసుకొచ్చామన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంటు ద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించామన్నారు. విద్యా, వైద్య రంగాల్లో తమ ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. భూ వివాదాలకు శాశ్వత ముగింపు దిశగా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టామని, గతంలో మండలానికి ఒక సర్వేయరు ఉంటే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల్లో 10,185 మంది సర్వేయర్లను నియమించామని, ఇదంతా మనందరి ప్రభుత్వం గ్రామ స్థాయిలో తీసుకొచ్చిన మరో మార్పు అని సిఎం పేర్కొన్నారు. 2019 వరకు రాష్ట్రంలో 11 మెడికల్ కాలేజీలుంటే తమ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలు ఇవాళ రాష్ట్రంలో నిర్మించబడుతున్నాయన్నారు. 25 ఏళ్లకు ఢోకా లేకుండా ఉండేందుకు మరో 7 వేల మెగావాట్లకు సంబంధించి కేవలం రూ.2.49లకే మరో 25 ఏళ్లపాటు అందుబాటులో ఉండేటట్లు వ్యవసాయానికి ఏర్పాటు చేశామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉందన్నారు. అటు దావోస్‌లోనూ, ఇటు విశాఖ సమ్మిట్‌లోనూ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటి వద్దకే రేషన్ ఇస్తున్నామని, రోల్ మోడల్‌గా రాష్ట్రం నిలిచిందన్నారు. ప్రభుత్వ స్కూళ్ల ఊహకందని విధంగా కార్పొరేట్లకు దీటుగా తయారు చేస్తున్నామన్నారు. రైతు భరోసా పథకం ద్వారా 51.48 లక్షల మంది రైతులకు నాలుగేళ్ల కాలంలో ఈ పథకం ద్వారా రూ.27,602 కోట్లు, కౌలు రైతులు, ఆర్‌ఒఎఫ్ ఆర్ రైతులకు ఈ సాయం కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, పగటి పూటే 9 గంటల ఉచిత విద్యుత్తు, ఎంఎస్‌పికి మాత్రం తగ్గకుండా ఆహార ధాన్యాల కొనుగోలు, ధాన్యం సేకరణ, ఆర్‌బికెల ద్వారా ఇ-క్రాపింగ్ ఇలా ప్రతి ఒక్క విషయంలో వ్యవసాయ రంగంలో ఎన్నడూ లేని విధంగా మార్పులు తీసుకొచ్చామన్నారు. సున్నా వడ్డీలో అక్కా చెల్లెమ్మలను ఆదుకుంటున్నామని, అన్ని వర్గాల సంక్షేమం దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారధి, కన్నబాబు, కళావతి పాల్గొన్నారు.


స్పీకర్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న కోటంరెడ్డి

కోటంరెడ్డి నిరసన

- సమస్యలు పరిష్కరించాలని ఆందోళన
- సెషన్ మొత్తం సస్పెన్షన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని వైసిపి రెబల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వినూత్న రీతిలో శాసనసభ లోపల, బయట నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల రెండోరోజు బుధవారం ఉదయం కోటంరెడ్డి వెలగపూడి నుంచి శాసనసభ ఆవరణం వరకు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని ప్లకార్డుతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి రైతులు కోటంరెడ్డికి ఆకుపచ్చ శాలువాను కప్పి తమ సంఘీభావం తెలిపారు. అనంతరం శాసనసభలో స్పీకరు తమ్మినేని సీతారాం ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభించగానే కోటంరెడ్డి ప్లకార్డుతో నిలుచున్నారు. మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయం ముగిశాక సభను స్పీకరు వాయిదా వేశారు. ప్రారంభంకాగానే వైసిపి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి లైవ్ ప్రసారంలో కనిపించకూడదన్న ఉద్దేశంతో ఆయన సీటు పక్కన ఉన్న సీట్లన్నింటినీ ఖాళీ చేసి దూరంగా వెళ్లారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు వచ్చి కోటంరెడ్డి చేతిలోని ప్లకార్డును చించేశారు. దీంతో స్పీకరు పోడియం ముందుకు కోటంరెడ్డి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. సభకు మిగతా 7లో

పార్లమెంటు నుంచి ఇడికి మార్చ్

- ప్రతిపక్ష ఎంపీలను అడ్డుకున్న పోలీసులు

న్యూఢిల్లీ : అదానీ కుంభకోణంపై ఫిర్యాదు చేసేందుకు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు బుధవారం పార్లమెంటు నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) ప్రధాన కార్యాలయానికి ప్రదర్శనగా బయల్దేరగా, పోలీసులు వారిని మధ్యలోనే అడ్డుకున్నారు . అధికార బిజెపి రాజకీయ లక్ష్యాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ ఫిర్యాదును సమర్పించేందుకు 18 ప్రతిపక్ష పార్టీల ఎంపీలు యత్నించారు. పార్లమెంట్ నుంచి బయటకు వచ్చిన నేతలను విజయ్ చౌక్ వద్ద భారీ సంఖ్యలో ఏర్పాటు చేసిన బారికేడ్లతో నిలువరించారు. 144 సెక్షన్ అమలులో ఉందని, ఇక్కడ ఎలాంటి ఆందోళనలకు అనుమతి లేదని, కాబట్టి ప్రదర్శన ముందుకు కదలడానికి లేదని ప్రతిపక్ష ఎంపీలను ఢిల్లీ పోలీసులు హెచ్చరించారు. భారీస్థాయిలో బలగాల మోహరింపుతో ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ 'అదానీ అంశంపై ఇడి డైరెక్టర్‌ను కలిసేందుకు మేం బయలుదేరాం. కానీ మేం వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించలేదు. ఇది అతి పెద్ద కుంభకోణం. అదాని కంపెనీల్లో ఎల్‌ఐసి, ఎస్‌బిఐ, ఇతర బ్యాంకుల పెట్టుబడులు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తుల కొనుగోలుకు ప్రభుత్వం ఒక వ్యక్తిని ప్రోత్సహిస్తోంది. గతంలో కొద్దిపాటి వ్యాపారాలు ఉన్న వ్యక్తి అనూహ్యంగా రూ.13 లక్షల కోట్లకు ఎలా ఎగబాకాడు? ఇది ఎలా సాధ్యం? ఎవరు డబ్బు ఇస్తున్నారు? మోడీకి, అదానీకి మధ్య ఉన్న బంధం ఏంటి? ఈ విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నించిన ప్రతిపక్ష నేతల గళాన్ని అణచివేస్తున్నారు' అని విమర్శలు గుప్పించారు. తాము 200 మంది ఉంటే, పోలీసులు 2,000 మంది దాకా ఉన్నారని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. తమ గొంతును నొక్కేస్తున్న వీరే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని ఎంపీలు ధ్వజమెత్తారు. అలాగే కేంబ్రిడ్జిలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ నేత మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. రాహుల్ నుంచి క్షమాపణ డిమాండ్ చేస్తున్నవారు, గతంలో విదేశీ గడ్డపై దేశ ప్రజల గురించి మోడీ చేసిన అవమానకర వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలన్నారు.

"అదానీ సమస్య"పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ దర్యాప్తును ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని కాంగ్రెస్ లోక్‌సభ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి అన్నారు. తన అవినీతి ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే జెపిసి ఏర్పాటుకు బిజెపి తిరస్కరిస్తున్నదని వారు పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నంత వరకు జెపిసి కావాలని బిజెపి డిమాండ్ చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

అదానీ అంశంపై దర్యాప్తు చేపట్టాలి
ఇడికి ప్రతిపక్ష పార్టీల లేఖ

షెల్ కంపెనీల ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడడంతో సహా అవినీతి విధానాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అదానీ గ్రూపుపై దర్యాప్తు చేపట్టాలని పలు ప్రతిపక్ష పార్టీల నేతలు బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని కోరారు. ఈ మేరకు ఇడి డైరెక్టర్ ఎస్.కె.మిశ్రాకు వారు ఒక లేఖను ఇ మెయిల్ చేశారు. ఈ విషయంలో ఇడి తన అధికార పరిధిని త్యజించరాదని వారు కోరారు. ఆ లేఖపై కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, జెడియు, ఎస్-ఎస్(యుబిటి), ఆర్‌జెడి, డిఎంకె, జెఎంఎం, ఆప్, ఐయుఎంఎల్, విసికె, కేరళ కాంగ్రెస్ పార్టీల నేతలతో సహా పలువురు సంతకాలు చేశారు. "ఇటీవలి కాలంలో, సెబి, సిబిఐలతో మిగతా 7లో



చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుచేసిన ప్రపంచ రాజకీయ పార్టీల సదస్సును వీడియో లింక్ ద్వారా ప్రారంభిస్తున్న చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, ఈ సదస్సులో సిపిఐ(ఎం) తరపున పాల్గొన్న ఆ పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం ఎ బేబి, కేంద్ర కమిటీ సభ్యులు అర్ అరుణ్ కుమార్‌ను చిత్రంలో చూడొచ్చు. - వార్త లోపలి పేజీల్లో...

'అసెంబ్లీ' ముగిసే వరకూ

పయ్యావుల, నిమ్మల సస్పెన్షన్

- సభాహక్కుల కమిటీకి సిఫార్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నరుపై అసత్య ప్రచారం చేశారంటూ టిడిపి ఎమ్మెల్యేలు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడును అసెంబ్లీ సమావేశాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేస్తున్నట్లు శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం ప్రకటించారు. ఈ విషయంపై నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు ఈ అంశాన్ని ప్రివిలైజ్ కమిటీకి సిఫార్సు చేస్తున్నట్లు స్పీకరు వెల్లడించారు. తానేమి తప్పు చేయకపోయినా, ఏమీ మాట్లాడలేదని, మాట్లాడేందుకు మైక్ కూడా ఇవ్వలేదని, తనను ఎలా సస్పెండ్ చేస్తారని స్పీకరును నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఎందుకు సస్పెండ్ చేస్తున్నారో వివరణ ఇవ్వాలంటూ నిమ్మలకు మద్దతుగా 12 మంది టిడిపి సభ్యులు స్పీకరు పోడియాన్ని ముట్టడించారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని స్పీకరు పోడియం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా మిగిలిన టిడిపి సభ్యులనూ ఒకరోజు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకరు ప్రకటించారు. ఇదే అంశంపై సభలో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, అంబటి రాంబాబు, పయ్యావుల కేశవ్ మధ్య వాడీవేడిగా మాటల యుద్ధం


కేశవ్


రామానాయుడు

సాగింది. స్పీకరు కార్యాలయంలో గవర్నరు వేచి ఉండేలా చేశారని పయ్యావుల ఆరోపించినట్లు ఓ దినపత్రికలో వచ్చిన వార్తపై సభలో గందరగోళం జరిగింది. ఇదే విషయంపై సభ ఆలస్యంగా ప్రారంభమైందని, గవర్నరును నేరుగా శాసనసభకు తీసుకురావాలని ప్రొసీడింగ్స్‌లో ఉందని సభలో చదివి పయ్యావుల వినిపించారు. ఇదే అంశంపై స్పీకరు వివరణ ఇస్తూ.. రాజ్‌భవన్ నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం స్పీకరు ఛాంబర్‌లో రెండు నిమిషాలు ఆగి సభకు వచ్చామని, ఇందులో నిబంధనలు ఏమీ ఉల్లంఘన జరగలేదన్నారు. ఇదే విషయం మంగళవారం రాజ్‌భవన్ సూచనను ఎందుకు సభ్యులకు తెలియజేయలేదని పయ్యావుల ప్రశ్నించారు. అనంతరం మార్షల్స్ రంగ ప్రవేశం చేయడంతో టిడిపి సభ్యులు సభ నుంచి నిష్క్రమించారు.



ఎగుమతుల వరుస పతనం

- ఫిబ్రవరిలో 9% క్షీణత

న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్‌లో భారత సరుకులకు డిమాండ్ పడిపోతోంది. వరుసగా మూడో మాసంలోనూ ఎగుమతులు తగ్గాయి. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో దేశ ఎగుమతులు 8.8శాతం పతనమై 33.88 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే మాసంలో 37.15 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన నెలలో దిగుమతులు 8.21 శాతం తగ్గి 51.31 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. దీంతో దేశ వాణిజ్య లోటు 17.43 బిలియన్ డాలర్లకు ఎగిసింది. 2022 జనవరిలో వాణిజ్య లోటు 17.42 బిలియన్ డాలర్లుగా, ఫిబ్రవరిలో 17.75 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో భారత సరుకు ఎగుమతులు 7.5 శాతం పెరిగి 405.94 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు ఏకంగా 18.82 శాతం ఎగిసి 653.47 బిలియన్ డాలర్లకు చేరాయి.

రూ.2.96 లక్షల కోట్ల బడ్జెట్?

- ఎక్కువ శాతం సంక్షేమ పథకాలకే
- ఉదయం 8 గంటలకు కేబినెట్‌లో ఆమోదం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమ చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు సిద్ధమైంది. గురువారం ఉదయం 11 గంటలకు ఈ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. సుమారు రూ.2.96 లక్షల కోట్ల వరకు బడ్జెట్ ఉంటుందని అంచనా. ఇందులో ఎక్కువ శాతం రెవెన్యూ వ్యయానికే కేటాయింపులు జరుగుతాయని తెలుస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితిపై పెరుగుతున్న ఆంక్షల నేపథ్యంలో ఈ బడ్జెట్ కొంత తగ్గి రూ.2.65 లక్షల కోట్లకు పరిమితమయ్యే అవకాశాలు కూడా ఉంటాయని పలువురు భావిస్తున్నారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ఆమోదించనుంది.

2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పైనే అంతా దృష్టి సారిస్తున్నారు. తరువాత ఏడాది బడ్జెట్ సమయానికి ప్రస్తుత ప్రభుత్వమే అధికారంలో ఉంటున్నప్పటికీ.. అది ఓట్ ఆన్ అకౌంట్ విధానం కావడంతో నేటి బడ్జెట్టే చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌గా చెప్పాలి. అందుకే తాజా బడ్జెట్‌ను ఎన్నికల బడ్జెట్‌గానే పరిగణించాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతి ఎన్నికల బడ్జెట్ సమయంలోనూ సంక్షేమ పథకాలకే పెద్దపీట వేస్తారు. అదే తరహాలో ఈ బడ్జెట్‌లో కూడా ఉన్నంత మేరకు సంక్షేమం, ఇతర పథకాలకే పెద్దపీట వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

రాజధానిపై ఎలా..?

ఇక విద్య, వైద్యం, ఇరిగేషన్, రాజధాని, పోలవరం వంటి వాటికి బడ్జెట్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజధానిపై ఇంకా స్పష్టత లేకపోవడం, కోర్టులో వివాదం నడుస్తుండడంతో దానిని నిధులు కేటాయింపులు ఉండవన్న భావన వ్యక్తమవుతోంది. గవర్నరు ప్రసంగంలో కూడా ఈ అంశం ప్రస్తావనకు రాకపోవడం తెలిసిందే. వైద్యానికి ఏకంగా రూ.20 వేల కోట్లకు పైగా నిధులు కోరుతుండగా, అంత కేటాయించే అవకాశాలు లేవని అంటున్నారు. పెట్టుబడి వ్యయంలో అత్యంత కీలకమైన నీటిపారుదల రంగంపైనా కొన్నేళ్లుగా నిధుల సమస్య వేధిస్తోంది. ఈ శాఖకు గత బడ్జెట్‌లో రూ.11,482 కోట్లు కేటాయిస్తే ఇప్పటివరకు రూ.5 వేలకోట్లు మాత్రమే ఖర్చు చేయడం చూస్తే ఈ ఏడాది కూడా కోతలు తప్పవన్న భావన వ్యక్తమవుతోంది. పోలవరానికి ఎంత కేటాయింపులు ఉంటాయన్నదానిపై అందరి దృష్టి ఉంది.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


రాష్ట్రంలో 8 ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల కౌంటింగ్ గురువారం జరగనుంది. తొలుత స్థానిక సంస్థల ఫలితాలు, రాత్రికి ఉపాధ్యాయ, అర్ధరాత్రి దాటిన తరువాత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 37 మంది, ప్రకాశం నెల్లూరు, చిత్తూరులో 22 మంది, కడప, అనంతపురం కర్నూలులో 49 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రకారం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గంలో 8 మంది, కడప, అనంతపురం, కర్నూలు నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, కర్నూలు జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. దీనిలో శ్రీకాకుళంలో ఇద్దరు, పశ్చిమగోదావరిలో ఆరుగురు, కర్నూలులో ముగ్గురు పోటీపడుతున్నారు. కాగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల ఫలితం తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉంటుందని హైకోర్టు బుధవారం పేర్కొంది. ఎన్నికల ఓట్ల లెక్కింపును యధాతథంగా నిర్వహించవచ్చునని స్పష్టం చేసింది.

తలసరి ఆదాయం రూ.2,19,518

- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి
- విడుదల చేసిన సిఎం
- నేడు సభ ముందుకు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ.2,19,518గా నమోదైనట్లు సామాజిక ఆర్థిక సర్వే 2023-24 నివేదికలో వెల్లడించారు. ఈ నివేదికను బుధవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలోని తన ఛాంబర్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ సొసైటీ సిఇఒ విజయకుమార్, సిఎస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద విజయకుమార్ మాట్లాడుతూ వరుసగా రెండేళ్ల ఆర్థిక ప్రగతిలో ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగుతున్నామని తెలిపారు. గతేడాదితో పోలిస్తే 16.2 శాతం ఈ ఏడాది ప్రగతి సాధించినట్లు తెలిపారు. రాష్ట్రం విడిపోకముందు దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తలసరి ఆదాయం అధికంగా ఉండేదని, విడిపోయిన తరువాత తగ్గి ప్రస్తుతం క్రమంగా పెరుగుతోందని వివరించారు. రాష్ట్ర జిఎస్‌డిపి రూ.13.17 లక్షల కోట్లుగా నమోదైందని తెలిపారు. ఒక్క సంవత్సరంలో రూ.1.81 లక్షల కోట్లుగా స్టేట్ జిఎస్‌డిపి నమోదవడం అరుదుగా జరుగుతుందని



సామాజిక ఆర్థిక సర్వే నివేదికను విడుదల చేస్తున్న సిఎం జగన్. చిత్రంలో బుగ్గన, సిఎస్ జవహర్, విజయకుమార్

వివరించారు. గతేడాది రూ.1.87 లక్షల కోట్లుగా జిఎస్‌డిపి నమోదైందని, వరుసగా రెండేళ్ల ఆర్థిక ప్రగతిలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగుతోందని సర్వేలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

ప్రధానంగా వ్యవసాయ, పరిశ్రమల రంగం, సేవా రంగాల్లో సేవారంగం నుంచి వాటా 40 శాతానికిపైగా ఉంటుందని వివరించారు. పరిశ్రమల రంగంలో 23.5 శాతం, వ్యవసాయ రంగంలో 36 శాతం వృద్ధి ఉందని తెలిపారు. వ్యవసాయ రంగంపై 60 శాతం మంది ప్రజలు ఆధారపడిన రాష్ట్రం ప్రగతివైపుగా పయనిస్తోందనడానికి గణాంకాలే నిదర్శనమని చెప్పారు. ప్రధానంగా పరిశ్రమలు ఎలక్ట్రిసిటీ రంగంలో 30 శాతం, కన్‌స్ట్రక్షన్ రంగంలో 17 శాతం ఉందని వివరించారు. మైనింగ్ అండ్ క్వారీయింగ్ రంగంలో 16 శాతం, ఉత్పత్తి రంగంలో 12 శాతం గ్రోత్ రేటు ఉందని చెప్పారు. కోవిడ్ తర్వాత ట్రేడ్, టూరిజం, హోటల్స్ రంగంలో ప్రగతి సాధించినట్లు వివరించారు. ట్రాన్స్‌పోర్టు, రియల్ ఎస్టేట్ రంగంలో అత్యధిక ప్రగతి నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్య, వ్యవసాయ రంగంలోనూ అభివృద్ధి ఉందని వివరించారు. పిల్లల మరణాల రేటు తగ్గిందని, ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత కల్పించామని తెలిపారు. 95 శాతం కుటుంబాలకు ఆరోగ్యశ్రీ ద్వారా భద్రత కల్పించామని, దేశంలో అత్యధికంగా కవరైన రాష్ట్రంగా నీతిఅయోగ్ గుర్తించిందని పేర్కొన్నారు.

కాంట్రాక్టు పద్ధతిలోనే

- డిఎస్‌సి-1998 అభ్యర్థులకు పోస్టింగ్
- ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-1998 అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో పోస్టింగు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన జిఓ 27ను పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ బుధవారం విడుదల చేశారు. డిఎస్‌సి-1998కు చెందిన 4,534 మంది అభ్యర్థులను ఎస్‌జిటిలుగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. 60 ఏళ్లు దాటని అభ్యర్థులకు మాత్రమే కాంట్రాక్టు పద్ధతిలో మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) కింద నియమాకం ఉంటుందని తెలిపారు. నియామకం తరువాత ఎన్‌సిటిఇ గుర్తింపు పొందిన విద్యా సంస్థ నుంచి ఆరు నెలల ప్రాథమిక విద్య బ్రిడ్జ్ కోర్సును రెండేళ్లలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. వీరికి కేవలం కాంట్రాక్టు ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలు మాత్రమే వర్తిస్తాయని, రెగ్యులర్ టీచర్లకు వర్తించే ఎలాంటి ప్రోత్సాహకాలు వర్తించవని తెలిపారు.

ఎన్ఇపిలో పేద విద్యార్థులు విద్యకు దూరం

- టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని టిడిపి ఎమ్మెల్యేలు డోలా బాలవీరాంజనేయస్వామి, ఏలూరి సాంబశివరావు అన్నారు. గత విద్యా సంవత్సరంలో నాలుగు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో చేరారన్నారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వారు మాట్లాడారు. ఎన్ఇపితో పేద విద్యార్థులు చదువుకోలేరని దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాలు తిరస్కరిస్తే రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా తల్లిదండ్రుల అభ్యంతరాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా అమలు చేస్తోందని విమర్శించారు. ఎన్ఇపితో పాఠశాలలు మూసివేతకు గురవుతున్నాయని అన్నారు. ఇందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టిడిపి హయాంలో ఐదువేల స్కూళ్లను మూసేశారని, తమ ప్రభుత్వం ఆ స్కూళ్లను తిరిగి తెరిపించిందని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క పాఠశాలా మూతపడలేదని, ఏ ఊరులో స్కూలు మూతపడిందో చెప్పాలని మంత్రి బొత్స అన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అక్రమ ప్రాజెక్టులపై ప్రశ్నిస్తామనే సస్పెండ్

- టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మిస్తున్న నీటిపారుదల అక్రమ ప్రాజెక్టులపై ప్రశ్నిస్తామనే భయంతో తమను శాసన సభ నుంచి ప్రభుత్వం సస్పెండ్ చేసిందని టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. ఆ పార్టీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అశోక్ బాబుతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగభద్రపై అప్పర్ భద్ర ప్రాజెక్టును నిర్మిస్తున్న కర్ణాటక ప్రభుత్వాన్ని, శ్రీశైలంపై అక్రమ ప్రాజెక్టులు కడుతున్న తెలంగాణ ప్రభుత్వాన్ని జగన్ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. రాయలసీమ ఎడారి అవుతున్నా, అక్కడి ప్రజలకు చివరకు గుక్కెడు తాగునీరు కూడా దొరకని దుస్థితి రాబోతున్నా ముఖ్యమంత్రిలో చలనం లేదని విమర్శించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే తమను సభ నుంచి బయటకు పంపుతారా? అని ప్రశ్నించారు. రాయలసీమకు సంబంధించిన ప్రధాన అంశాల్ని మరుగునపరిచేందుకే మంత్రులు గవర్నర్ ప్రసంగాన్ని ప్రస్తావనకు తెచ్చారని అన్నారు. తాను మాట్లాడిన దానిని ప్రభుత్వం వక్రీకరించి, గవర్నరు వ్యవస్థను తప్పుపట్టినట్లు ప్రచారం చేస్తుందని విమర్శించారు. 100 నిమిషాలు సభ జరిగితే, తూతూ మంత్రంగా నాలుగు నిమిషాలే తమకు అవకాశం ఇస్తున్నారని తెలిపారు. 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ 20 మంది టిడిపి ఎమ్మెల్యేలకు సమాధానం చెప్పలేక సస్పెండ్ చేశారని నిమ్మల రామానాయుడు విమర్శించారు.

శ్రీ నరసింహస్వామి దేవాలయము (గట్టు)
భూమయ్యగారిపల్లి(గ్రా), వేముల (మం), కడప జిల్లా.
e-Procurement Tender
NIT NO. COE/537/2022-79 Dt:24-11-2022
దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు http://tender.apeprocure ment. gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : ధర్మకర్త

నాన్నను చంపిన వారిని వదిలిపెట్టను

- నిజం బయటకు రావాలి..న్యాయం గెలవాలి
- మీడియాతో వివేకా కుమార్తె సునీత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ సునీత

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

తన తండ్రి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని ఎవరు హత్య చేశారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, ఈ కేసులో నిజాలు బయటకు రావాలని, న్యాయం గెలవాలని, తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందేనని డాక్టర్ సునీత అన్నారు. వివేకా నాల్గవ వర్ధంతి సందర్భంగా కడప జిల్లా పులివెందులలోని ఆయన ఘాట్ వద్ద బుధవారం ఆమె నివాళులర్పించారు. అనంతరం మీడియాతో సునీత మాట్లాడారు. 'ఇలాంటి సంఘటనలు ఎవరికీ జరగకూడదు. అందుకోసమే నేను న్యాయపోరాటం చేస్తున్నాను. నిజం బయటకు రావాలి. నాకు తెలిసిన విషయాలు దర్యాప్తు సంస్థకు డాక్యుమెంట్స్ రూపంలో వెల్లడించాను. హత్య ఎవరు చేశారో తెలుసుకోకుండా ఎలా వదిలి పెడతాను. కొంతమంది దర్యాప్తు సంస్థను తప్పుదోవ పట్టిస్తున్నారు. దర్యాప్తు సంస్థలు, పోలీసుల విచారణ సక్రమంగా జరిగేలా అందరూ సహకరించాలి. కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నానని నాకు కూడా తెలుసు. హత్య కేసులో ప్రమేయం ఉందని నమ్ముతున్నందునే వారిపై సిబిఐకి అన్ని విషయాలు తెలియజేస్తున్నాను. రాయలసీమలో హత్యలు మామూలేనని గతంలో కొందరు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే 30 ఏళ్ల క్రితం గొడవలు మళ్లీ మొదలయ్యాయి. నాన్నను ఎవరు హత్య చేశారో తెలుసుకోకుండా ఎలా వదిలిపెట్టగలను' అని సునీత అన్నారు. నాకు తెలియని వాళ్లు ఎంతోమంది సహకరిస్తున్నారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్.వివేకానందరెడ్డికి నివాళులర్పించిన వారిలో సునీతతో పాటు అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, వైఎస్.ప్రతాప్‌రెడ్డి, నరెడ్డి శివప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

వివేకా హత్య జగనాసుర రక్తచరిత్ర

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జగనాసుర రక్తచరిత్ర అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. హత్య ఆ ఇంట జరిగిన కుట్ర అని, ఈ విషయం పులివెందుల పూల అంగాళ్ల నుంచి రాష్ట్రంలోని ప్రతి ఇంటా తెలుసు అని తెలిపారు. జస్టిస్ ఫర్ వైఎస్ వివేకా అంటూ ట్విట్టర్‌లో బుధవారం చంద్రబాబు పేర్కొన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాష్ట్రంలో ఒక్క పనీ చేయలేకపోయారని విమర్శించారు. చివరకు సొంత బాబాయి హత్య కేసులో నిజమైన నిందితులను శిక్షించడంలో సహా అని అన్నారు. తండ్రి శవం పక్కన ఉండగానే పదవి కోసం సంతకాలు సేకరించిన వ్యక్తి అని వైఎస్ జగన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. బాబాయి హత్యతో రాజకీయ లబ్ధి పొందిన వ్యక్తి ఆడబిడ్డకు న్యాయం చేస్తారా? అని ప్రశ్నించారు.



ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను విస్మరించారు

టిడిపి శాసనసభాపక్ష ఉప నాయకుడు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక ఈ నాలుగేళ్లలో ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించిందని టిడిపి శాసనసభాపక్ష ఉప నాయకుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం గత టిడిపి ప్రభుత్వం రూ.1,754 కోట్లను ఖర్చు చేసి 69 వేల ఎకరాలకు నీరందిస్తే వైసిపి ప్రభుత్వం కేవలం రూ.485 కోట్లను మాత్రమే ఖర్చు చేసి 1100 ఎకరాలకు మాత్రమే నీరందించిందని తెలిపారు. బుధవారం శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అచ్చెన్నాయుడు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రభుత్వాన్ని నిలదీశారు. వంశధార ప్రాజెక్టు రెండో దశ, తోటపల్లి ప్రాజెక్టు, గజపతినగరం కెనాల్, మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, వంశధార, నాగావళి నదుల అనుసంధానం, తారకరామ తీర్థసాగరం రిజర్వాయరు, మడ్డువలస ప్రాజెక్టు, జంఝావతి ప్రాజెక్టు, గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ పనులను ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా నిధులను కేటాయించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. టిడిపి ప్రభుత్వం కేవలం కమీషన్ల కోసమే సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు.

తిరుపతిలో రీ-పోలింగ్ పూర్తి

- ఏజెంట్, మీడియాపై సిఐ ఓవరాక్షన్
- చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



గంగరాజును నెట్టుకొస్తున్న పోలీసులు

తిరుపతిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ రీ-పోలింగ్ ముగిసింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ 229 పోలింగ్ బూత్ (చిన్న బజారువీధి, గర్ల్స్ హైస్కూల్)లో 49.57 శాతం, 233 బూత్ (సత్యనారాయణపురం)లో 44.07 నమోదయ్యింది. 229 బూత్‌లో 579 ఓట్లకు గాను కేవలం 287, 233 బూత్‌లో 792 ఓట్లకు గాను 349 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 1371 మంది ఓట్లకు గాను 636 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. సత్యనారాయణపురం పోలింగ్ బూత్‌లోకి పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి జనరల్ ఏజెంట్ వాడ గంగరాజు వెళుతుండగా సిఐ చంద్రశేఖర్ అడ్డుకుని దురుసుగా ప్రవర్తించారు. మెడ పట్టుకుని బయటకు తోసేశారు. 50 అడుగుల దూరంలోనే వైసిపి అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపి గురుమూర్తి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి ఉండొచ్చు, తాను మాత్రం దూరంగా ఉండాలా అని మీడియా ఎదుట నాగరాజు ప్రశ్నించారు. సిఐ మరింత దురుసుగా ప్రవర్తిస్తూ మీడియా కెమెరా లాక్కునే ప్రయత్నం చేశారు. సిఐను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి పిడిఎఫ్ నాయకులు కందారపు మురళి మీడియాకు తెలిపారు.

వేసవిలో బదిలీలు పూర్తి చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను వేసవిలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్‌ను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ సమగ్ర శిక్షా కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో ఒక్కసారి మాత్రమే ఉపాధ్యాయ బదిలీలు చేపట్టిందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి కోర్టు కేసులు క్లియర్ చేయించాలని, ఎస్ఎలు, ప్రధానోపాధ్యాయులకు రెగ్యులర్ ప్రమోషన్లు ఇప్పించాలని, పండిట్ కోర్టు కేసులు క్లియర్ చేయించాలని, కెజిబివిలకు పెంచిన వేతనాలపై ఉత్తర్వులు ఇప్పించాలని, 2008 డిఎస్‌సిలో రెండు పోస్టులకు ఎంపికైన వారి ఖాళీలు గుర్తించి తదుపరి అర్హత కలిగిన వారికి నియామకాలు ఇవ్వాలని, సమ్మెటివ్-2 పరీక్షలకు ప్రింటెడ్ ప్రశ్నాపత్రాలు అందించాలని కోరారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిఎస్ఆర్‌టిసి (పిటిడి) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రవాణాశాఖ కమిషనరు ద్వారకా తిరుమలరావును ఆర్‌టిసి హౌస్‌లో కలిసి వినతిపత్రం అందించారు. 2022 సెప్టెంబరు ముందు కాలానికి పెండింగ్‌లో ఉన్న సెలవులు, సస్పెన్షన్ పీరియడ్, ఇంక్రిమెంట్లు, అడ్వాన్స్‌మెంట్ స్కేళ్ల ఎరియర్స్ చెల్లించాలని, ట్రిమ్స్ అలవెన్సులు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై ప్రతిపాదనలు ఆర్థికశాఖకు పంపుతామని, ట్రిమ్స్ అలవెన్సు త్వరలో పునరుద్ధరిస్తామని, మూడేళ్లుగా పెండింగులో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఎరియర్లు త్వరలో చెల్లిస్తామని కమిషనరు హామీ ఇచ్చారు.

బిసిల సమగ్ర కుల గణన జరపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ

బీహార్, ఒడిశాలోల్లాగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా 'సమగ్ర కుల గణన' జరిపించాలని కోరుతూ బిసి సాధికార సమాఖ్య ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. విజయవాడ హోటల్ ఐలాపురంలోని శ్రీరామ పంక్షన్ ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్, టిడిపి, బిఎస్‌పి, జనతాదళ్, సమాజ్‌వాదీ, బిజెపి, ఆర్‌పిఐ, ఆమ్ ఆద్మీ, జై భారత్, మహాజన సోషలిస్టు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 'సమగ్ర కులగణన' జరపడంతోనే సాధ్యమని తెలిపారు.

చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు దక్కాలన్నా, కేంద్ర మంత్రి వర్గంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు కావాలన్నా, బిసి జాబితాను జాతీయస్థాయిలో వర్గీకరిస్తున్న జస్టిస్ రోహిణి కమిషన్ నివేదికలో రాష్ట్ర జాబితాలోని బిసిలకు న్యాయం దక్కాలన్నా కుల గణన జరపాలని కోరారు. బిసిల ఆకాంక్ష మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణన వెంటనే జరిపించాలని డిమాండ్ చేశారు. బిసి సాధికార సమాఖ్య అధ్యక్షులు పామర్తి జయ ప్రకాష్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు వి.గురున్నాధం, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ ప్రసాద్ రాజ్, జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా వరప్రసాద్, నేషనల్ జనశక్తి పార్టీ కడియం సూరిబాబు, బిసి సాధికార సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల బాబ్జి, మేడిసెట్టి ఇజ్రాయిల్, ఉప్పాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని వెంటాడుతున్న 'ఎమ్మెల్సీ' ఎన్నికల భయం

- ఒక్కో అభ్యర్థి గెలుపునకు ఇద్దరు మంత్రులకు బాధ్యత
- కోటంరెడ్డి, ఆనం అసమ్మతితో మరొకరి కోసం అన్వేషణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్యేల కోటాలో ఏడుగురు అభ్యర్థులను శాసన మండలిలో ఏకగ్రీవంగా గెలిపించుకుంటామని ఊహించిన వైసిపికి ఇప్పుడు ఎవరో ఒక అభ్యర్థికి ఇబ్బంది ఏర్పడుతుందోమోన్న భయం వెంటాడుతోంది. అసెంబ్లీలో 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నా వివిధ అంశాల్లో టిడిపికి అవకాశం ఇవ్వరాదన్న లక్ష్యంతో నలుగురు టిడిపి ఎమ్మెల్యేలను వైసిపి ప్రభుత్వం తన వైపునకు తిప్పుకోగలిగింది. దీంతో గత నాలుగేళ్లుగా ఎమ్మెల్యేల కోటాలో ఎన్ని ఖాళీలు వచ్చినా వైసిపి సునాయసనంగా దక్కించుకుంటోంది. ఈ నేపథ్యంలో ఏడుగురు ఎమ్మెల్సీల పదవీకాలం ఈనెలాఖరులో ముగియనుంది. ఏడుగురు వైసిపి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా ఈనెల 13న టిడిపి నుంచి పంచుమర్తి అనురాధ ఎమ్మెల్సీగా నామినేషన్లు వేశారు. దీంతో పోటీ అనివార్యం అయింది. ఎమ్మెల్సీగా గెలవాలంటే కనీసం 23 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. టిడిపి నుంచి 23 మంది గెలుపొందినా నలుగురు వైసిపికి మద్దతు పలుకుతున్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైసిపిలోనూ అసమ్మతి ఎమ్మెల్యేల సంఖ్య పెరుగుతుండటంతో టిడిపి వ్యూహాత్మకంగా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీని రంగంలోకి తీసుకువచ్చింది. దీంతో వైసిపిలో ఓటమి బెడద ఏర్పడింది. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సిఎం జగన్ మంత్రులను రంగంలోకి దింపారు. ఒక్కో అభ్యర్థికి ఇద్దరు మంత్రులను కేటాయించారు. ఒక్కో అభ్యర్థికి కనీసం 22 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయాలి. ఏడుగురు అభ్యర్థులకు 154మంది మద్దతు అవసరం. వైసిపి నుంచి నెల్లూరు జిల్లాకు చెందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రాంనారాయణరెడ్డి అసమ్మతి గళం వినిపిస్తుండటంతో సంఖ్యాపరంగా వైసిపికి ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. అంతరాత్మ ప్రబోధానుసారం ఓటు వేస్తానని ఆనం ఇప్పటికే అసెంబ్లీ లాబీల్లో మీడియాతో వ్యాఖ్యానించారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో కూడా ఇలాగే వేశామని తెలిపారు. వీరిద్దరూ టిడిపి అభ్యర్థికి మద్దతు పలికితే వైసిపి ఇరకాటంలో పడుతుంది. టిడిపి ప్రస్తుతం ఉన్న 19మంది ఎమ్మెల్యేలతో పాటు మరో ముగ్గురిని సమీకరించుకోవాల్సి ఉంది. ఇప్పటికే కోటంరెడ్డి, ఆనం మద్దతు లభిస్తుందని ఊహిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు వైసిపి నుంచి మరొకరు తమ వైపునకు తిప్పుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇందుకు ఆనం, కోటంరెడ్డి సహకారం కూడా తీసుకుంటున్నారని తెలిసింది. జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తన ఓటు ఎవరికి వేస్తారన్నదీ ఆసక్తిగా మారింది. అటు టిడిపికి, ఇటు వైసిపికి ఒక్క ఓటు కీలకంగా మారిన నేపథ్యంలో ఆ ఒక్కరు ఎవరన్నదీ అసెంబ్లీ లాబీల్లో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కోర్టు తీర్పుకు లోబడి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు

- యథాతథంగా ఓట్ల లెక్కింపునకు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల ఫలితం తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల ఓట్ల లెక్కింపును యథాతథంగా నిర్వహించవచ్చునని స్పష్టం చేసింది. ఎన్నికల ఓట్ల లెక్కింపు వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపును నిలిపివేయాలని కోరుతూ ఆ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థి కోడి శ్రీనివాస్ దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. పోలింగ్ జరిగే రోజు శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాల్లో దిగువ కోర్టులు పని చేశాయని పిటిషనరు తరపున న్యాయవాది వాదించారు. చాలా మంది న్యాయవాదులు ఓట్లు వేయలేకపోయారని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక కోర్టుల జోక్యానికి ఆస్కారం లేదని ఎన్నికల ప్రధాన అధికారి తరపున న్యాయవాది పేర్కొన్నారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. కౌంటింగ్ ప్రక్రియ ముందుగా నిర్ణయించిన ప్రకారం జరుపుకోవచ్చని స్పష్టం చేసింది. ఎన్నికల ఫలితం కోర్టు తుది తీర్పుకు లోబడి ఉంటుందని షరతు విధించింది. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికను సవాల్ చేసిన కేసును హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

'ఉక్కు' ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకోండి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 762వ రోజుకు చేరాయి. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు రామకృష్ణ, పరంధామయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల సదస్సు నిర్వహించి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని ప్రగల్భాలు పలకడం మానుకొని, రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కృషి చేయాలని అన్నారు. పార్లమెంట్‌లోనూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటాన్ని ఎంపీలంతా చేపట్టాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలతో కమిటీ వేసి ప్రధాని వద్దకు తీసుకెళ్లేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి చొరవ ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలన్న దుర్మార్గపు ఆలోచనలను విరమించుకోకుంటే మోడీ ప్రభుత్వానికి ప్రజలు రానున్న రోజుల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కొత్త ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఏర్పాటు చేయలేని కేంద్రానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. దీక్షల్లో నాయకులు ఎమ్‌డి.బాషా, మురళి, తిరుపతి రాజు, ఐవి.అప్పారావు, సాయి, డబ్ల్యుఆర్ఎం - 1, 2 విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఇపిఎస్ - 95 పెన్షనర్లు రిటైర్డ్ ఉద్యోగి అప్పారావు ఆధ్వర్యంలో దీక్షా శిబిరానికి తరలివచ్చి మద్దతు తెలిపారు.

చల్లా భగీరథకు, బచ్చుల అర్జునుడుకి మండలి నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల మృతి చెందిన శాసన మండలి సభ్యులు చల్లా భగీరథరెడ్డి (వైసిపి), బచ్చుల అర్జునుడు (టిడిపి)కు శాసన మండలి బుధవారం నివాళ్లర్పించింది. సంతాప తీర్మానం అనంతరం సభ గురువారానికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు ప్రకటించారు. సమావేశం ప్రారంభం కాగానే ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సంతాప తీర్మానాలను ప్రవేశపెట్టారు. కొద్దికాలం క్రితమే భగీరథ రెడ్డి తండ్రి చల్లా రామకృష్ణారెడ్డి మృతి చెందారని, ఆయన స్థానంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన భగీరథరెడ్డి చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమని మంత్రి తెలిపారు. సహకార సంఘాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ స్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన బచ్చుల అర్జునుడు నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడు అని కొనియాడారు. మండలి ఛైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ.. ఎంతో భవిష్యత్తున్న ఇద్దరు ఎమ్మెల్సీలను కోల్పోవడం బాధకరం అన్నారు. ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృషుడు కూడా వీరి మృతి తీరని లోటని అన్నారు. భగీరథరెడ్డి, బచ్చుల అర్జునుడు అందించిన సేవలను పలువురు సభ్యులు కొనియాడారు.రాజకీయ నేపథ్యం కలిగిన ఇద్దరు నాయకులు ఎమ్మెల్సీలుగా పనిచేస్తూ ప్రజా సేవలో నిమగ్నమై ఆకస్మికంగా మృతి చెందడం బాధాకరం అని డిప్యూటీ ఛైర్మన్ జకియా కానం, మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, పివిఎస్ రాజు, ఎన్ఎండి ఫరూక్, కెఎస్ లక్ష్మణరావు, దొక్కా మాణిక్య వరప్రసాద్, ఇక్బాల్, పి అశోక్‌బాబు, కెఇ ప్రభాకర్, వాకాటి నారాయణరెడ్డి, రమేష్ యాదవ్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బిటి నాయుడు, అంగర రామ్మోహనరావు, పోతుల సునీత, దువ్వారపు రామారావు, రాజ నరసింహ, వై శ్రీనివాసరెడ్డి, చిక్కాల రామచంద్రరావు అన్నారు. వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. మండలి రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి మృతికి సంతాపం తెలియజేసింది.

దిశ, దశ లేని పార్టీ జనసేన

- పౌరసరఫరాలశాఖ మంత్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీకి దిశ, దశ లేదని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. పవన్‌కు దమ్ముంటే రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీకి నాయకులను నిలబెట్టాలని సవాల్ విసిరారు. సచివాలయ మీడియా పాయింట్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. బిసిలకు అన్యాయం చేసిన టిడిపికి పవన్ వంతపాట పాడుతున్నారన్నారు. రంగా హత్య కేసులో చంద్రబాబు హస్తమున్నట్లు చేగొండి హరిరామజోగయ్య పుస్తకంలో రాశారని, రంగాను చంపిన వారిని సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో ఒక్క రోడ్డూ వేయలేదన్నారు.

కాపులను టిడిపికి అమ్మేస్తున్న పవన్

కాపులను పవన్‌కల్యాణ్ టిడిపికి అమ్మేస్తున్నారని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. పార్టీ సిద్ధాంతం, ఆశయాలు ఏమిటో కూడా వార్షికోత్సవ సభలో పవన్ కల్యాణ్ చెప్పలేకపోయారన్నారు. ఏడాదిలో ఎన్నికలు వస్తుంటే మేనిఫెస్టో కూడా చెప్పుకోలేకపోయారని పేర్కొన్నారు. పార్టీ పెట్టి పదేళ్లయినా సొంతంగా పోటీ చేసే సత్తా లేదన్నారు. వంగవీటి రాధా రెండు కులాలకు చెందిన దంపతులకు పుట్టారని చెప్పిన పవన్ రాష్ట్రంలో రెండు సామాజిక తరగతులు కలిసి పనిచేయాలని కేడర్‌కు పిలుపునివ్వడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.

పవన్‌కు బిజెపి అంటే భయం : పేర్ని నాని

పవన్‌కల్యాణ్‌కు బిజెపి అంటే భయం అని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. కొన్నిసార్లు బిజెపితో తెగదెంపులు చేసుకున్నట్లు చెబుతూనే మోడీ, అమిత్‌షా, జెపి నడ్డా మంచోళ్లని అనడమే దీనికి నిదర్శనమన్నారు. కులంతో సంబంధం లేదంటూనే మచిలీపట్నంలో జరిగిన ఆవిర్భావ సభలో ప్రత్యేకంగా కాపు కులస్తులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. కమ్మపై ద్వేషం ఎందుకు? రెడ్లపై ప్రేమ ఎందుకు? అంటూనే అందరం కలిసి బాబు దగ్గరకు వెల్దామని చెప్పారన్నారు. ఈ సభలో పవన్ చెప్పినవన్నీ అసత్యాలేనని అన్నారు. అన్ని పార్టీలూ కలిసి పోటీ చేసినా 2024 ఎన్నికల్లో వైసిపిదే అధికారమన్నారు.

గన్నవరం ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గన్నవరం టిడిపి కార్యాలయంపై వైసిపి మూకలు దాడి చేయడమే కాకుండా తనను అక్రమ అరెస్టు చేసి తీవ్ర మానసిన, భౌతిక క్షోభకు గురిచేశారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి)లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఈ మేరకు ఆయన కమిషన్ సభ్యులు రాజీవ్ జైన్‌ను కుటుంబంతో సహా కలిసి వినతి అందజేశారు. కృష్ణా జిల్లా ఎస్‌పి జాషువా ఆదేశాలతో తనను అక్రమ అరెస్టు చేసి, సెల్ ఫోన్ బలవంతంగా లాక్కున్నారని తెలిపారు. గంటల తరబడి పోలీస్ వాహనంలో తిప్పుతూ, నిర్మానుష్య ప్రదేశాల్లో ఆపుతూ, గుడివాడ పరిసర ప్రాంతాల్లో తిప్పి, చివరిగా ఎస్‌పి ఆదేశాలతో తొట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని అన్నారు. విద్యుత్ సరఫరా తొలగించి, సిబ్బందిని బయటకు పంపి, ముగ్గురు మాస్క్ ధరించిన వ్యక్తులతో దాదాపు 40 నిమిషాలపాటు భౌతికంగా హింసించారని తెలిపారు. ఫిబ్రవరి 20న అరెస్టు చేసి 21 సాయంత్రం వరకు అరెస్టు విషయాన్ని తన కుటుంబ సభ్యులకు చెప్పలేదని, వైద్యపరీక్షల్లో ఎంఆర్ఐ స్కాన్ చేయించాలని అభ్యర్థించినా అనుమతించలేదని వివరించారు. తన సతీమణిని కూడా గృహ నిర్బంధం చేశారని, ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా పోలీసులను పెట్టి భయాందోళనలకు గురిచేశారని తెలిపారు. ఇప్పటికి నాలుగు సార్లు తనపై, తన ఇంటిపై దాడి చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను కోరారు.

పార్టీ కార్యాలయానికి స్థలమివ్వండి

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరికి వైసిపి ఎంపిలు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్టీ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని వైసిపి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి వైసిపి రాజ్యసభ, లోక్‌సభ నేతలు వి విజయసాయిరెడ్డి, పివి మిథున్‌రెడ్డి ఆధ్వర్యాన వైసిపి ఎంపిలు వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో వైసిపి ఎంపిలు మోపిదేవి వెంకటరమణ, బెల్లాన చంద్రశేఖర్, భీశెట్టి సత్యవతి, ఎంవివి సత్యనారాయణ, గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, పోచా బ్రహ్మానందరెడ్డి ఉన్నారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజును వైసిపి రాజ్యసభ పక్షనేత వి విజయసాయిరెడ్డి కలిశారు. ఎపికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు విజయసాయిరెడ్డి తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రంలో పురిటినొప్పులు

- 108 వాహనంలో ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్


ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పాలవలస దేవి

ఇంటర్ పరీక్ష రాస్తుండగానే మహిళకు పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి తరలించిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం చోటుచేసుకుంది. పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన వివాహిత మహిళ పాలవలస దేవి (22) ఒక ప్రయివేటు కళాశాలలో వెటర్నరీ ఒకేషనల్ కోర్సు చదువుతున్నారు. తొమ్మిది నెలల గర్భిణీ అయిన ఆమె తొలి రోజు జనరల్ పౌండేషన్ పేపర్ పరీక్ష రాసేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి హాజరయ్యారు. పరీక్ష ప్రారంభమైన కొద్ది సమయానికే ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ ఆకులరాజు వెంటనే సంబంధిత ఇంటర్ పరీక్ష నిర్వాహణ అధికారులకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. తరువాత ఆమెను 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. ఎక్కువ సేపు కూర్చోవడంతో స్వల్పంగా నొప్పులు వచ్చాయని, ఇంకా డెలివరీకి రెండు రోజులు సమయం పడుతుందని వైద్యులు తెలిపారు.

సామూహిక గృహ ప్రవేశాలపై
మళ్లీ సందిగ్ధమే!

- రాష్ట్ర వ్యాప్తంగా ఉగాదికి ఐదు లక్షల ఇళ్లు లక్ష్యం
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో వాయిదా?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం మరోసారి వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ కార్యక్రమం ఒకసారి వాయిదా పడింది. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల గృహాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించుకుంది. గతేడాది డిసెంబర్ 21న వీటిలో సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని తొలుత అనుకుంది. అప్పటికి లక్ష్యంలో 39.32 శాతం ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో, గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. ఉగాది నాటికైనా ఇవి పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించింది. ఈ నెల 22న ఉగాది నేపథ్యంలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ మరుసటి రోజు ఎమ్మెల్యే కోటాలో ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 25వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. దీంతో, అప్పటివరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. ఈ నేపథ్యంలో గృహ ప్రవేశాల కార్యక్రమం వాయిదా పడొచ్చన్న చర్చ సాగుతోంది. మరోవైపు ఈ కార్యక్రమంపై ఎక్కడా ఎటువంటి కదలికా కనిపించడం లేదు. లక్ష్యాల పూర్తి, కార్యక్రమం రూపకల్పనపై ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఎటువంటి ఆదేశాలూ రాలేదు. మరో వారం రోజులే మిగిలి ఉండడం, సామూహిక ప్రవేశాలపై అధికార యంత్రాంగాన్ని సంసిద్ధత చేసే పని ఇప్పటివరకు జరగకపోవడంతో మళ్లీ వాయిదా పడినట్లుగా అంతా భావిస్తున్నారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా ప్రభుత్వం 16,60,171 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో ఐదు లక్షల ఇళ్లను


నౌపడలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

2022 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుంది. గత డిసెంబర్ 15 నాటికి 1,96,595 ఇళ్లు (39.32 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. లక్ష్యం సగం కూడా పూర్తి కాకపోవడంతో గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఉగాది నాటికైనా పూర్తి స్థాయిలో గృహాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మంగళవారం నాటికి 3,07,214 (లక్ష్యంలో 62 శాతం) ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వీటిలో ఇంకా సగం ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం, తాగునీటి సౌకర్యం పెండింగ్‌లో ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 33,241 మందితో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 22,032 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిలో సుమారు 11 వేల ఇళ్లకు మాత్రమే విద్యుత్తు సౌకర్యం, సుమారు పది వేల ఇళ్లకు మాత్రమే తాగునీటి సౌకర్యం కల్పించారు.

ఐదు జిల్లాల్లో 50 శాతంలోపే ఇళ్లు పూర్తి

రాష్ట్రంలో పది జిల్లాల్లో 50 శాతంలోపే ఇళ్లు పూర్తయ్యాయి. వాటిలో అనంతపురం, పల్నాడు, వైఎస్ఆర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,814 ఇళ్లకుగానూ రెండు ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏ మాత్రమూ సరిపోకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రాలేదు. జిల్లా సమీక్షా సమావేశాల్లో మంత్రులు సైతం ఇంటి నిర్మాణ ఖర్చును పెంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. నివాస యోగ్యంలేని చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడం వంటి కారణాలతో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. ఇళ్లు నిర్మించకపోతే పట్టాలు వెనక్కి తీసుకుంటామని అధికారులు, గ్రామ/వార్డు వలంటీర్లు ఒత్తిడి చేయడంతో అయిష్టంగా కొందరు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకోవడం కూడా గృహ నిర్మాణాలు నత్తకడనక సాగడానికి కారణం ఉంది.


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న సిఐటియు నేత డిఎన్‌విడి.ప్రసాద్

పోరాట విజయం

- రెండు రోజుల సమ్మెతో దిగొచ్చిన 'గోద్రెజ్' యాజమాన్యం
- అక్రమ బదిలీలు నిలిపివేతకు అంగీకారం

ప్రజాశక్తి - చింతలపూడి (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సీతానగరంలోని గోద్రెజ్ పామాయిల్ ఆగ్రోవెట్ పరిశ్రమ కార్మికులు రెండు రోజులుగా సాగించిన పోరాటం విజయం సాధించింది. పరిశ్రమలో యూనియన్ పెట్టారన్న అక్కసుతో యాజమాన్యం కార్మిక నేతలను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేసి వేధింపు చర్యలకు దిగింది. దీంతో కార్మికులు మంగళవారం రాత్రి నుంచి విధులు బహిష్కరించి ఆకస్మిక సమ్మె చేపట్టారు. ఫ్యాక్టరీ వద్దే టెంట్లు వేసి బైఠాయించి పెద్దఎత్తున ఆందోళన చేశారు. కార్మికుల ఆందోళనకు సిఐటియు అండగా నిలిచింది. దీంతో దిగొచ్చిన యాజమాన్యం బుధవారం మధ్యాహ్నం యూనియన్ నేతలను చర్చలకు ఆహ్వానించింది. ఈ చర్చల్లో ఇతర రాష్ట్రాలకు అక్రమ బదిలీలను నిలిపివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. కార్మికులపై కక్షసాధింపు చర్యలు చేపట్టబోమని, మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. చర్చల్లో ఫ్యాక్టరీ జనరల్ మేనేజర సంజుమాథ్యూ, హెచ్‌ఆర్ మేనేజర్ ప్రవీణ్, యూనియన్ నేతలు బాలకృష్ణ, పెద్దిరాజు, నాగరాజు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం : సిఐటియు

చర్చల అనంతరం ఫ్యాక్టరీ వద్ద కార్మికులు విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల ఐక్యత వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. ఇది ఫ్యాక్టరీలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు దిక్సూచి అన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.పెద్దిరాజు, పి.బాలకృష్ణ, నాగరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, సిఐటియు నేతలు ఎస్‌కె.సుభాషిణి, నత్తా వెంకటేశ్వరరావు, ఆర్‌విఎస్.నారాయణ, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు, రాజకీయాలు వేర్వేరు

- నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ
- విజయ చాముండేశ్వరి, విశ్వనాథరెడ్డికి ఎన్‌టిఆర్ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి, తెనాలిరూరల్ (గుంటూరు జిల్లా)


సినిమాలను రాజకీయాలను వేరువేరుగా చూడాలని నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో బుధవారం సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ అధ్యక్షత వహించిన ఎన్‌టిఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో, బుర్రా సాయి మాధవ్ నేతృత్వంలో ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్‌లో ఏడాదిపాటు ఎన్‌టిఆర్ సినిమాలను ఉచితంగా ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉత్సవ కమిటీ రోజుకొక కళాకారులను సన్మానిస్తూ ప్రతినెలా సినీ ప్రముఖులకు ఎన్‌టిఆర్ పురస్కారాలను అందజేస్తోంది. ఈ నేపథ్యంలో సినీ నటి సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, నిర్మాత డి నాగిరెడ్డి తనయుడు విశ్వనాథరెడ్డిలకు ఈ పురస్కారాన్ని బాలకృష్ణ అందజేశారు. అనంతరం ఎన్‌టిఆర్ నటించిన పాతాళ భైరవి చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మహానటుడు ఎన్‌టిఆర్ పేరుమీద కళామతల్లి ముద్దుబిడ్డలను సినీరంగ


విజయ చాముండేశ్వరిని సత్కరిస్తున్న బాలకష్ణ ఆలపాటి తదితరులు

ప్రముఖులను సత్కరించుకోవడం మంచి సంప్రదాయం అన్నారు. సావిత్రి, ఎస్‌వి రంగారావు, రేలంగి, అంజి లాంటి ఎందరో ప్రముఖులను పాతళభైరవి చిత్రం పరిచయం చేసిందని గుర్తుచేశారు. అటువంటి చిత్రాన్ని నిర్మించిన నాగిరెడ్డి కుమారుడు, మహానటి సావిత్రి కుమార్తెను సన్మానించుకోవడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. విజయ చాముండేశ్వరి మాట్లాడుతూ తెనాలితో సంబంధం ఈనాటిది కాదని తెలిపారు. 2017లో తెనాలి ఒక కార్యక్రమానికి వచ్చానని గుర్తుచేశారు. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ లాంటి మహాపురుషుని సినిమాలకు నిర్మాతగా నాన్న, తాను పనిచేశామని తెలిపారు. బాలయ్య చేతులమీదుగా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

'ప్రజా స్పందన' సిఎస్.రావు మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)


సిఎస్.రావు (ఫైల్ ఫొటో)

విశాఖ నగరానికి చెందిన రిటైర్డ్ ఐఇఎస్ అధికారి సిఎస్.రావు (93) బుధవారం కన్నుమూశారు. ఆరేళ్లుగా నరాల బలహీనత వ్యాధితో బాధపడుతున్న ఆయన స్థానిక ద్వారకానగర్ ఐదో లైన్‌లోని తన తన నివాసంలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పూర్తి పేరు చాగంటి సుందరరావు. సిఎస్.రావుగానే నగర ప్రజలకు సుపరిచితులు. ప్రజా స్పందన పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణపై ఆయన తీవ్ర పోరాటం సాగించారు. విశాఖపట్నం కేంద్ర కారాగారాన్ని అడవివరం ప్రాంతానికి తరలించిన సమయంలో పాత జైలు ప్రాంతంలో అతిపెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం కోసం గత ప్రభుత్వాలు ప్రయత్నించాయి. ఆ స్థలంలో ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను తొలగించడాన్ని తప్పుబడుతూ సిఎస్.రావు న్యాయ పోరాటం చేశారు. ఆ ఉద్యమానికి కోర్టు తీర్పు అనుకూలంగా వచ్చింది. దీంతో ప్రభుత్వం అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని విరమించుకొని పార్కును నిర్మించింది. వైఎస్ఆర్ సెంట్రల్ పార్కుగా ఇది నేడు పేరొందిది. సిఎస్.రావు మృతి వార్త తెలిసిన వెంటనే నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.బాలమోహనదాస్ తదితరులు తరలివచ్చి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : బొప్పరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వంలో విలీనమయ్యాక ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలన్నీ తీరుతాయనుకుంటే మరిన్ని సమస్యలు ముందుకొచ్చాయని, ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపి జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. విజయవాడలోని బస్టాండ్‌లో ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బొప్పరాజుతోపాటు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడారు. వైద్య సేవలను తగ్గించడం, అలవెన్సులు, టిఎ, డిఎలను తగ్గించడం వంటి చర్యలతో ఆర్‌టిసి ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. చివరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లాస్ ఫ్లోర్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ ఏదీ?

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-బి.కొత్తకోట(అన్నమయ్య జిల్లా)


ముస్లిములతో నిర్వహించిన సదస్సులో మాట్లాడతున్న లోకేష్

రాష్ట్రంలో రాక్షస ప్రభుత్వం రాజ్యమేలుతోందని, ఎస్‌సిలపై దాడులు అధికమయ్యాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన యాత్ర బుధవారం 43వ రోజుకు చేరుకుంది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని గుట్టపాలెం నుంచి ప్రారంభమైన యాత్ర గట్టు, కొండకిందపల్లి, బుచ్చిరెడ్డిపల్లి, ఇందిరమ్మ కాలనీ వరకూ సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, ఎస్‌సి సామాజిక తరగతులు, టమోటా రైతులతో ముఖాముఖి, సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో మాస్కు అడిగినందుకు విశాఖపట్నంలో దళిత డాక్టర్ సుధాకర్‌ను హింసించి ఈ ప్రభుత్వం పొట్టనబెట్టుకుందని విమర్శించారు. వైసిపి నేతల ఇసుక అక్రమాలను అడ్డుకున్నందకు తూర్పుగోదావరిలో వరప్రసాద్‌కు శిరోముండనం చేశారన్నారు. చిత్తూరులో మద్యం మాఫియాని ప్రశ్నించిన ఓంప్రతాప్‌ని హత్య చేశారని విమర్శించారు. రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదని తెలిపారు. దళితులకు చెందాల్సిన రూ.వేల కోట్ల సబ్ ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. దళితుల అభివృద్ధి, సామాజిక న్యాయానికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల కోసం గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని హామీ నిచ్చారు. టిడిపి అధికారంలోకి వచ్చాక 2025 జనవరి 1న జాబ్ కేలండర్ విడుదల చేస్తామని, .అందులో ఉర్దూ టీచర్ల పోస్టులు కూడా ఉంటాయని తెలిపారు. ముస్లిములకు రెసిడెన్షియల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఎన్నికల ముందు గుర్తొచ్చిన టమోటా రైతులు, అధికారంలోకి వచ్చాక కనిపించకపోవడం దారుణమన్నారు. తాము అధికారంలోకి వచ్చాక టమోటా పల్పింగ్ యూనిట్ పెడతామని, మదనపల్లి టమోటా మార్కెట్ బాధ్యతలను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో మాజీ జడ్జి రామకృష్ణ పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై 22న ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానములో ఈ నెల 22న శ్రీ శోభకృత్ నామ సంవత్సర "ఉగాది" వేడుకలు నిర్వహిస్తున్నట్లు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి భ్రమరాంబ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని పురస్కరించుకొని ఈ నెల 31 తేదీ వరకు పుష్పార్చనలతో వసంత నవరాత్రోత్సవాలు జరుగుతాయని వైదిక కమిటీ సూచనలు మేరకు నిర్ణయించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 22వ తేదీ తెల్లవారు ఝామున సుప్రభాత సేవతో వేడుకలు మొదలవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం 6.00 గంటలకు మల్లికార్జున మహామండపం నుండి "వెండి రథోత్సవ" ఊరేగింపు బయలు దేరుతుందని తెలిపారు. 23వ తేదీ నుండి 30 వరకు ప్రతి రోజూ ప్రత్యేక పుష్పార్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో భక్తులు పాల్గొనాలని ఆలయ అధికారులు తెలిపారు.

తీవ్ర ఒత్తిడిలో మరో అమెరికన్ బ్యాంక్..!

- ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ షేర్ 70% పతనం



వాషింగ్టన్ : అమెరికన్ బ్యాంక్‌ల సంక్షోభం ఒక్కొక్కటిగా భయటపడుతున్నాయి. తాజాగా మరో బ్యాంక్ మూత పడనుందని రిపోర్టులు వస్తున్నాయి. తాజాగా రిపబ్లిక్ బ్యాంక్ షేర్ 70 శాతం పతనంతో మూతవేత దిశగా పయనిస్తోందని సమాచారం. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌తో పాటు మరో ఐదు బ్యాంకింగ్ సంస్థల పరపతిని సమీక్షిస్తున్నామని ఆదివారం మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీసెస్ పేర్కొంది. దీంతో సోమవారం ఆ బ్యాంక్ షేర్ ఏకంగా 70 శాతం పడిపోయింది. ఫెడరల్ రిజర్వ్, జెపి మోర్గాన్ చేజ్ అండ్ కోతో సహా ఒప్పందాల కార్యకలాపాల ద్వారా నిర్వహణ కోసం 70 బిలియన్ డాలర్లకుపైగా నగదు నిల్వలు ఉన్నాయని ఆ బ్యాంక్ ప్రకటించినప్పటికీ.. స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. సిలికాన్ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌ల మూత తర్వాత అమెరికా సహా యూరప్ మార్కెట్‌లలో పెద్ద బ్యాంక్‌ల షేర్లు వేగంగా పడిపోతున్నాయి. గత వారంలో ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్ షేర్ 74.25 శాతం పడిపోయింది. గడిచిన పది రోజుల్లోనే సిల్వర్ గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి), సిగ్నేచర్ బ్యాంక్‌లు దివాళా తీసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ఆందోళనలు, భయాలు వ్యక్తం అవుతోన్నాయి.

హైదరాబాద్‌లో బ్లాక్‌బెర్రీ ఐఒటి సెంటర్ ఏర్పాటు


హైదరాబాద్ : బ్లాక్‌బెర్రీ లిమిటెడ్ కొత్తగా హైదరాబాద్‌లో తన ఐఒటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, ఇంజనీరింగ్, ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. కెనడా తరువాత అంతర్జాతీయంగా బ్లాక్‌బెర్రీ ఐఒటి డివిజన్‌లలో రెండవ అతిపెద్ద కేంద్రంగా ఇది నిలువనుందని తెలిపింది. ఇక్కడ 100మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీరులు పని చేయనున్నారని పేర్కొంది. ఈ ప్రపంచ శ్రేణీ ఇంజినీరింగ్ కేంద్రం, భారతదేశపు అత్యుత్తమ ఎంబీడెడ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను నియమించుకోవడం ద్వారా భావితరపు వాహన సాఫ్ట్‌వేర్ వేదిక (ఎస్‌డివిలు) నిర్మించడంలో సహాయపడనున్నట్లు పేర్కొంది. అదే విధంగా ఇతర ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరిశ్రమలలో అత్యాధునిక ఆవిష్కరణలకు చేపట్టనున్నట్లు తెలిపింది. మార్చి 29న బెంగళూరులో జరగనున్న వార్షిక టెక్ ఫోరమ్ ఇండియాకు ముందుగా తమ తమ కార్యకలాపాలను విస్తరించేందుకు తగిన ప్రణాళికలను వెల్లడించనున్నట్లు బ్లాక్‌బెర్రీ ఐఒటి ప్రెసిడెంట్ మత్తియాస్ ఎరిక్‌సన్ పేర్కొన్నారు.

ఐదో రోజూ పతనమే..

- సెన్సెక్స్‌కు 344 పాయింట్ల నష్టం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవి చూశాయి. బుధవారం సెషన్‌లోనూ అమ్మకాల పరంపర కొనసాగింది. అంతర్జాతీయ ప్రతికూల పరిణామాలకు తోడు దేశీయంగా ఎలాంటి సానుకూల అంశాలు కానరావడం లేదు. ఈ పరిణామాలతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 344 పాయింట్లు కోల్పోయి 57,556కు దిగజారింది. ఐదు సెషన్లలో ఈ సూచీ 2,792 పాయింట్లు నష్టపోయింది. దీంతో మదుపర్ల సంపద దాదాపుగా రూ.8 లక్షల కోట్లు పైగా ఆవిరయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 71 పాయింట్లు తగ్గి 16,972 వద్ద ముగిసింది. నిఫ్టీ 50లో భారతీ ఎయిర్‌టెల్, ఇండుస్‌ఇండ్ బ్యాంక్ సూచీలు అధికంగా 2 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. రిలయన్స్ 1.7 శాతం నష్టపోగా, ఎస్‌బిఐ, హెచ్‌యుఎల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, నెస్లే, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 1 శాతం చొప్పున తగ్గాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్సియల్, టెలికాం స్టాక్స్ ఎక్కువగా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

అతిమూత్ర వ్యాధికి ఎంఎస్ఎన్ ఔషధం



హైదరాబాద్ : అతి మూత్ర వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఎంఎస్ఎన్ గ్రూపు బయోఈక్వలెంట్ జనరిక్ వెర్షన్ అయిన ఫెసొబిగ్‌ను ఆవిష్కరించింది. బుధవారం దీన్ని హైదరాబాద్‌లో ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భరత్ రెడ్డి విడుదల చేశారు. ఓవరాక్టివ్ బ్లాడర్ (ఒఎబి), యూరినరీ ఇన్‌కాంటినెన్స్ చికిత్స కోసం వివిధ అంతర్జాతీయ చికిత్స మార్గదర్శకాల ద్వారా అత్యంత సురక్షిత, వినూత్నత ఫస్ట్ లైన్ ఫార్మాకోథెరపీ ఎంపికగా ఈ ఔషధం సిఫారసు చేయబడిందని భరత్ రెడ్డి తెలిపారు. "ఫెసొబింగ్ టాబ్లెట్‌ల ఆవిష్కారం భారతీయ రోగుల బాధలను తగ్గించడానికి క్లిష్టమైన చికిత్సలలో సరసమైన మందులను తీసుకురావడానికి పరిశోధన చేయడానికి మా కొనసాగుతున్న నిబద్ధతకు అను గుణంగా ఉంది" అని భరత్ రెడ్డి పేర్కొన్నారు.

భీమవరంలో మెడికల్ రిప్స్ రాష్ట్ర కౌన్సిల్

ప్రజాశక్తి - భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి)

ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఎపిఎంఎస్‌ఆర్‌యు) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 18, 19 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్ హాలులో జరుగుతాయని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.దక్షిణామూర్తి తెలిపారు. భీమవరంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలుత సమావేశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం దక్షిణామూర్తి మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్ సంఘం మెడికల్ రిప్‌ల ఉద్యోగ భద్రత కోసమే కాకుండా వైద్యారోగ్య రంగంలో సమస్యలపై గత 55 ఏళ్లుగా పోరాడుతోందని, పలు సమస్యల పరిష్కారంలో విజయం సాధించిందని తెలిపారు.

భీమవరంలో జరగబోయే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో వైద్యఆరోగ్య రంగం ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలనే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణ రూపొందించబోతున్నామని చెప్పారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.శిరీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ కౌన్సిల్ సమావేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటు వంటి వివిధ శాఖల నుండి 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొనబోతున్నారని తెలిపారు.



బిటెక్ పట్టాను స్వీకరిస్తున్న రామ్‌గోపాల్ వర్మ

మీ తలరాతలను మీరే రాసుకోండి

- వర్సిటీ విద్యార్థులతో సినీ దర్శకులు రామ్‌గోపాల్ వర్మ
- వర్మకు బిటెక్ డిగ్రీ పట్టా ప్రదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

కష్టపడి చదివితే కూలీలు అవుతారని, ఇష్టపడి చదవాలని, మీ తలరాతలను మీరే రాసుకోవాలని సినీ దర్శకులు రామ్ గోపాలవర్మ విద్యార్థులకు సూచించారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జునా యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరిగే విద్యా విజ్ఞాన ప్రదర్శన మొదటి రోజు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 1981లో బిటెక్ పూర్తి చేసిన రామ్‌గోపాల్ వర్మ ఒరిజనల్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. అనంతరం వర్సిటీ డైకమెన్ ఆడిటోరియంలో విసి ఆచార్య పి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో రామ్‌గోపాల్ వర్మ ప్రసంగించారు. విశ్వవిద్యాలయం తనకు బిటెక్ డిగ్రీని అందజేయడం ఆనందంగా ఉందన్నారు. తాను 35 సంవత్సరాల క్రితం సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తి చేసినట్లు తెలిపారు. తాను చదువుకున్న చదువుకు, చేస్తున్న వృత్తికి పొంతనలేకుండానే జీవితంలో తాను అనుకున్న స్థాయికి ఎదిగానన్నారు. ఊహాజనితమైన జీవితంలో కాకుండా యధార్థవంతంగా జీవించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు తనదైన రీతిలో సమాధానాలు చెప్పారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ రాజశేఖర్ మాట్లాడుతూ రామ్ గోపాల్‌వర్మను ఆధునిక తత్వవేత్తగా కొనియాడారు. తాను అనుకున్న విషయాల పట్ల సినిమాలు తీస్తూ ప్రత్యేక గుర్తింపును పొందారన్నారు. సమాజ సంబంధ అంశాలపై ఎప్పటికప్పుడు స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో చొరవ చూపాలని, దేశ ప్రగతిని ప్రపంచం నలువైపులా విస్తరింప చేయాలని విద్యార్థులను కోరారు. అనంతరం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను రాంగోపాల్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.మధుబాబు, ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ ప్రొఫెసర్ డి.నారాయణరావు, అర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపల్ ఈదర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్రలో ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్‌సి వర్గీకరణ జరిగేంత వరకూ ఉద్యమం

- ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు నరసింగరావు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

పార్లమెంట్‌లో ఎస్‌సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని.. లేని పక్షంలో మాదిగ గ్రామాల్లో రాజకీయ పార్టీ నాయకులను తిరగనివ్వబోమని ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు హెచ్చరించారు. ఎస్‌సి వర్గీకరణ జరిగేంత వరకూ ఉద్యమం ఆగదన్నారు. వర్గీకరణ కోరుతూ చేపట్టిన 'మాదిగల సంగ్రామ పాదయాత్ర' ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో బుధవారం ప్రారంభమై...మార్కాపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ.. ఏప్రిల్ 4న అమరావతి, హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయాలను ముట్టడిస్తామని చెప్పారు. మార్కాపురంలో పాదయాత్ర బృందానికి ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు కాశీరావు స్వాగతం పలికారు. ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్వీనర్ ఆదిమూలపు ప్రకాష్, సీనియర్ నేతలు వర్ల దేవదాసు మాదిగ, రావినూతల కోటయ్య మాదిగ పాల్గొన్నారు.

ఒనిట్సుకా టైగర్ ప్రచారకర్తగా రష్మిక

హైదరాబాద్ : జపనీస్ ఫ్యాషన్ బ్రాండ్ ఒనిట్సుకా టైగర్ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటీ రష్మిక మందాన్నను నియమించుకున్నట్లు తెలిపింది. భారత్‌లో కంపెనీ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే మందానన్న ప్రచారకర్తగా ఎంచుకున్నట్లు పేర్కొంది. ఫ్యాషన్‌తో పాటు స్పోర్ట్స్, ఇన్నోవేషన్‌తో కలిపి అత్యుత్తమ సమకాలీన కలెక్షన్‌లను అందించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.



సంపాదకీయం


పథకాల పటాటోపం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ మంగళవారం చేసిన ప్రసంగం ఆసాంతం ప్రభుత్వ నవరత్న పథకాల వల్లెవేతలతో నిండిపోయింది. బటన్ నొక్కడమొక్కటే అశేష జనబాహుళ్యం సంక్షేమమని మరోమారు గవర్నర్ చేత ప్రభుత్వం చెప్పించింది. పథకాలన్నింటినీ నవరత్నాల గొడుగు కిందకు తీసుకురావడమే సరికొత్త సమ్మిళిత వృద్ధి ఫార్ములా అని, అటువంటి సమ్మిళిత, సుస్థిరాభివృద్ధి తమ ప్రాధాన్యతలని పేర్కొంది. కాగా ఏడాదికోమారు చట్టసభల్లో చేసే గవర్నర్ ప్రసంగం ప్రభుత్వ దశ, దిశకు కొలమానంగా ఉండాలి. గడచిన సంవత్సరంపై సమీక్ష, రాబోయే ఏడాదికి కార్యాచరణ ప్రణాళికలపై సర్కారు స్పష్టత ఇవ్వాలి. ఈ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతున్న సమయాన, వచ్చే సంవత్సరం ఎన్నికలు జరిగే వేళ గవర్నర్ ప్రసంగం కీలకం. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఆ విధంగా ఆలోచించలేదని ప్రసంగాన్ని బట్టి అర్థమవుతుంది. రాష్ట్రాభివృద్ధి, రాజధాని, విభజన హామీలు, యువతకు ఉద్యోగ ఉపాధి, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలు దుర్భిణీ వేసి వెతికినా గవర్నర్ ప్రసంగంలో కనిపించవు. నాలుగేళ్లలో నగదు బదిలీ పథకాల జమా ఖర్చుల అంకెలే కనిపిస్తాయి. అవే ప్రభుత్వ గొప్పతనాలుగా వండి వార్చడం వంచనే అవుతుంది.

ఎ.పి. వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. ఆ రంగం అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు అనివార్యం. పదేళ్లల్లో 54 ప్రాజెక్టులు చేపడితే ఇప్పటికి పూర్తయినవి 14. రాష్ట్రానికి జీవనాడిగా పేర్కొనే 'పోలవరం'లో నిర్వాసితుల పునరావాసం 22 శాతమే పూర్తయింది. ఇంకా 78 శాతం పెండింగ్‌లో ఉండగా, ప్రాజెక్టు ఎప్పటికి పూర్తి చేస్తారు? గడువులు ముగుస్తున్నాయి తప్ప పురోగతి లేదు. కేంద్రం దోబూచులాటపై రాష్ట్ర ప్రభుత్వం నిలదీసింది లేదు. ఎన్నికల లబ్ధి కోసం ఎగువనున్న కర్ణాటకకు కేంద్రం నిధులిస్తున్న తరుణంలో నిత్యకరువులను చవి చూస్తున్న రాయలసీమను ఆదుకునేందుకు రాష్ట్ర సర్కారు చేసిన కనీస ప్రయత్నం లేదు. ఈ పూర్వరంగంలో వచ్చే నాలుగేళ్లల్లో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామంటే జనం నమ్మగలరా? నాలుగేళ్లలో ఒక్క కొత్త పరిశ్రమ పెట్టినట్లుకానీ, ఒక్కరికి ఉపాధి కల్పించినట్లుకాని చెప్పలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. ప్రతి ఏడాదీ జనవరిలో జాబ్ కేలండర్ ఎక్కడికి పోయిందో తెలీదు. ఖాళీగా ఉన్న 2.60 లక్షల సర్కారీ కొలువులు, కాంట్రాక్టు ఉద్యోగుల పర్మినెంట్, సిపిఎస్ రద్దు, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కార హామీలను ప్రభుత్వం మర్చిపోయినట్లుంది. సుమారు50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా ఒక్క డిఎస్‌సి కూడా ఇవ్వలేదు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల బకాయిలపైనా అంతే. చివరికి ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలివ్వడమూ గగనమైంది. ఉపాధి హామీ బకాయిలపైనా అశ్రద్ధే. ఇసుక సమస్య నేటికీ పరిష్కారం కాక లక్షలాది మంది భవన నిర్మాణ, అనుబంధ వృత్తుల వారు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కాదు సరికదా మద్దతు ధరలు కూడా దక్కడం లేదు. మేనిఫెస్టోనే తమకు భగవద్గీత, ఖురాన్, బైబిల్ అన్న ప్రభుత్వం నాలుగేళ్లయినా ముఖ్యమైన వాగ్దానాల ఊసు తీయట్లేదు.

విభజన హామీలు, నిధుల విషయంలో రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న ద్రోహాలను గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించకపోవడం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టడమే. విభజన చట్టం వచ్చి తొమ్మిదేళ్లు దాటింది. మరి కొన్ని నెలల్లో చట్టంలో చాలా అంశాలకు నిర్దేశించిన గడవు ముగుస్తుంది. ఇప్పుడు కూడా కేంద్రంపై పోరాడకపోతే రాష్ట్రానికి జరిగే నష్టానికి బాధ్యత ప్రభుత్వానిదే అవుతుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని కాగ్ వంటి సంస్థలు ఘోషిస్తున్నాయి. అప్పు పుడితేనే రోజు గడిచేదన్నట్లుంది. మంత్రి పదవులతో సామాజిక న్యాయం, దిశ యాప్‌తో మహిళలకు రక్షణ, సచివాలయ ఉద్యోగాలతో యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన వంటివి ప్రచార పటాటోపానికే పనికొస్తాయి. భవిష్యత్తు విజన్‌ను ఆవిష్కరించాల్సిన గవర్నర్ ప్రసంగం రాష్ట్రాభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని, సామాజిక న్యాయాన్ని విస్మరించింది. నేల విడిచి సాము చేసింది. ఇలాంటి ప్రసంగం వలన రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదు.

మహనీయుని మాట



గొప్ప గొప్ప ప్రయత్నాలన్నీ హేళనతోనే మొదలవుతాయి.
- చే గువేరా

ఇపిఎస్ పెన్షనర్ల ఉసురు తీస్తున్న మోడీ ప్రభుత్వం

విశ్లేషణ





పి. అజయ కుమార్

మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఇపిఎస్ పెన్షనర్లను (ఇపిఎఫ్ చందాదారులంతా ఇపిఎస్ పెన్షనర్లే) ముప్పుతిప్పలు పెడుతోంది. కోర్టు తీర్పుల ప్రయోజనాలను కూడా దక్కకుండా చేస్తోంది. అథమ స్థాయిలో ఉన్న కనీస పెన్షన్ వెయ్యి రూపాయలను పెంచటానికి తిరస్కరిస్తోంది. 2014 ఎన్నికల సమయంలో ఇపిఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచుతామని మ్యానిఫెస్టోలో బిజెపి వాగ్దానం చేసింది. ఇంత వరకు ఆ వాగ్దానాన్ని అమలు చెయ్యలేదు. కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు, డి.ఎ అమలు కోర్కెలను పట్టించుకోవటంలేదు. ఇపిఎస్ పెన్షనర్లకు సామాజిక పెన్షన్ల కంటే తక్కువ పెన్షన్ అందడం దారుణం.

మరోపక్క ఇపిఎఫ్ చట్టం ప్రకారం పరిమితికి మించి వాస్తవ వేతనాలపై ఉద్యోగులు, యాజమాన్యాలు పి.ఎఫ్ చెల్లించిన లేదా చెల్లిస్తున్న వారు అధిక పెన్షన్‌కు అర్హులని చెప్పటంలో అత్యున్నత న్యాయస్థానం పిల్లిమొగ్గలు వేస్తోంది. అధిక పెన్షన్ పొందాలంటే సర్వీసులో ఉండగా తాము, తమ యాజమాన్యాలు ఇపిఎస్ పథకం ప్రకారం 11(3) ఆప్షన్ ఇవ్వాలని, అప్పుడు మాత్రమే మేనేజ్‌మెంట్ వాటాలో 8.33 శాతం పెన్షన్ ఫండ్‌కు మళ్ళించబడుతుందని తమకు తెలియదని, ఇప్పుడు ఆ అవకాశం ఇవ్వాలని 2014కు ముందు రిటైర్ అయిన వారు కోర్టు మెట్లు ఎక్కారు. అలా రిటైర్ అయిన వారు తమకు వచ్చిన మేనేజ్‌మెంట్ వాటాలో 8.33 శాతం తిరిగి కడితే వారికి అధిక పెన్షన్ చెల్లించాలని అంతిమంగా 2016లో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

> 2014 ఆగస్టు 22న పి.ఎఫ్ పరిమితిని రూ.6500 నుండి రూ.15 వేలకు పెంచుతూ మోడీ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వివాదాస్పదమైంది. రూ. 15 వేలకు మించి అధిక పి.ఎఫ్ కట్టే వారికి మేనేజ్‌మెంట్ వాటాలో 8.33 శాతం పెన్షన్ ఫండ్‌కు బదిలీ కావాలంటే 11(4) ప్రకారం జాయింట్ ఆప్షన్‌ను 6 నెలల లోపు ఇవ్వాలంది. 15 వేలకు మించి వాస్తవ వేతనం మీద పెన్షన్ రావటానికి ఉద్యోగి అదనంగా 1.16 శాతం చెల్లించాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇంతకు ముందు ఇపిఎఫ్ చట్టం, ఇపిఎస్ ల ప్రకారం 1.16 శాతాన్ని తన బాధ్యతగా చెల్లించింది. దీంతో పాటుగా పెన్షనబుల్ శాలరీ లెక్కింపుకు ఆఖరు 12 నెలల సరాసరిని మోడీ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌లో ఆఖరు 60 నెలల సరాసరిగా మార్చింది. ఈ మార్పు వలన పెన్షన్ మరింతగా తగ్గింది.

2016 సుప్రీం కోర్టు తీర్పును మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు నటించింది. పి.ఎఫ్ వెనక్కి కట్టిన వారికి అధిక పెన్షన్ మంజూరు చేసి కొంత కాలం ఇచ్చి ఆపివేసింది. అధిక పెన్షన్ ఇస్తే పెన్షన్ ఫండ్ కరిగిపోతుందని సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అదే సమయంలో 2014 ఆగస్టు 22న పి.ఎఫ్ పరిమితిని రూ.6500 నుండి రూ.15 వేలకు పెంచుతూ మోడీ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వివాదాస్పదమైంది. రూ. 15 వేలకు మించి అధిక పి.ఎఫ్ కట్టే వారికి మేనేజ్‌మెంట్ వాటాలో 8.33 శాతం పెన్షన్ ఫండ్‌కు బదిలీ కావాలంటే 11(4) ప్రకారం జాయింట్ ఆప్షన్‌ను 6 నెలల లోపు ఇవ్వాలంది. 15 వేలకు మించి వాస్తవ వేతనం మీద పెన్షన్ రావటానికి ఉద్యోగి అదనంగా 1.16 శాతం చెల్లించాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇంతకు ముందు ఇపిఎఫ్ చట్టం, ఇపిఎస్ ల ప్రకారం 1.16 శాతాన్ని తన బాధ్యతగా చెల్లించింది. దీంతో పాటుగా పెన్షనబుల్ శాలరీ లెక్కింపుకు ఆఖరు 12 నెలల సరాసరిని మోడీ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌లో ఆఖరు 60 నెలల సరాసరిగా మార్చింది. ఈ మార్పు వలన పెన్షన్ మరింతగా తగ్గింది.

2014 మోడీ ప్రభుత్వ నోటిఫికేషన్‌ను కేరళ హైకోర్టు కొట్టివేసింది. దీనిపై కూడా మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళింది. 2014 నోటిఫికేషన్ పైన, అధిక పెన్షన్ ఆప్షన్ల పైన సుప్రీం కోర్టు బెంచ్ ముందు 4 సంవత్సరాల పాటు వాదోపవాదాలు నడిచాయి. అంతిమంగా 2022 నవంబర్ 4న ఈ రెండింటిపై సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. వాదోపవాదాలు జరుగుతున్న సమయంలోనే సుప్రీం కోర్టు ప్రభుత్వ వాదనలు కొన్నింటి వైపు మొగ్గు చూపినట్లు కనబడింది. నవంబర్ తీర్పు కొంత మందికి తీపిని, మరి కొంతమందికి చేదును అందించింది. చేదును అందించిన మేరకు మోడీ ప్రభుత్వం సంతోషపడింది. అయితే ఆ తీపిని కూడా పెన్షనర్లకు అందకుండా చేసేందుకు ప్రయత్నిస్తోంది.

2014కు ముందు పదవీ విరమణ చేసి సర్వీసులో ఉండగా హయ్యర్ పెన్షన్ ఆప్షన్ 11(3) ఇవ్వని వారికి తన తీర్పు ఎటువంటి ప్రయోజనం కలిగించదని సుప్రీంకోర్టు చెప్పింది. వీరందరికి సుప్రీంకోర్టు తీర్పు నష్టం చేసింది. ఈ విషయంలో మోడీ ప్రభుత్వ వాదనలతో సుప్రీంకోర్టు ఏకీభవించినట్లు అయ్యింది. 2016లో తాను ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా అత్యున్నత న్యాయస్థానం 2022 నవంబర్ 4న తీర్పు చెప్పింది.

మూడు రకాల ఇపిఎస్ పెన్షనర్లకు మాత్రమే అధిక పెన్షన్ వచ్చే అవకాశాలను సుప్రీం కోర్టు తీర్పు కల్పించింది. 1) 2014కు ముందు రిటైర్ అయిన వారు తాము సర్వీసులో ఉండగా (స్కీమ్‌లో సభ్యులుగా ఉండగా) అధిక పెన్షన్‌కు జాయింట్ ఆప్షన్ 11 (3) ఇచ్చి ఉండి, ఆ ఆప్షన్‌ను ఇపిఎఫ్ సంస్థ నిరాకరిస్తే అటువంటి వారికి మరలా 11(3) ఇచ్చే అవకాశం కల్పించింది. 2) 2014 సెప్టెంబర్ 1 నాటికి సర్వీసులో ఉండి ఆ తరువాత రిటైర్ అయిన వారు 3) ఇప్పటికీ సర్వీసులో కొనసాగుతున్న వారు. ఈ రెండు రకాల ఇపిఎఫ్ చందాదారులు, వారి యాజమాన్యాలు అధిక పెన్షన్ కోసం జాయింట్ ఆప్షన్‌లు 11 (3), 11 (4) రెండూ ఇచ్చే అవకాశం కల్పించింది.

అధిక పెన్షన్ అనేది పి.ఎఫ్ పరిమితికి మించిన వాస్తవ వేతనాలపై పిఎఫ్ చెల్లించిన వారికే వర్తిస్తుంది. పరిమితికి మించిన వాస్తవ వేతనాల మీద ఉద్యోగులు, యాజమాన్యాల పిఎఫ్ వాటాలు కట్టడమనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార రంగం, యూనియన్లు ఉన్న కొన్ని సంఘటిత ప్రైవేటు పరిశ్రమలు, షాపులు, సంస్థలలో మాత్రమే జరుగుతోంది. మిగతా ప్రైవేటు రంగంలో పరిమితులకు లోబడి చెల్లిస్తున్నారు.

మోడీ ప్రభుత్వం సెప్టెంబర్ 1వ తేదీ నాటికి సర్వీసులో ఉండి ఆ తరువాత రిటైర్ అయిన వారు, సర్వీసులో కొనసాగుతున్న వారికి కూడా అధిక పెన్షన్ ఇవ్వటానికి సుముఖంగా లేనట్లు కనపడుతోంది. వీరికి 11(3), 11(4) ఆప్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు అధికారికంగా ఇపిఎఫ్ వెబ్‌సైట్‌లో కేవలం 11(3) ఆప్షన్‌ను మాత్రమే పెట్టింది. 11(4) ఇంత వరకు పెట్టలేదు. కేవలం 11 (3) ఆప్షన్ ఒక్కటే తీసుకుంటే రూ.6500 నుండి రూ.15 వేల వరకు ఉన్న వేతనాలపైన మాత్రమే అధిక పెన్షన్ వస్తుంది. రూ.15 వేలకు మించిన వేతనాలపై పెన్షన్ రాదు. 11(3) ఆప్షన్‌లో కూడా మోడీ ప్రభుత్వం మోసకారితనంగా వ్యవహరించింది. ఆన్‌లైన్‌లో ఆప్షన్ లెటర్‌ను పూర్తి చేసే సందర్భంలో అంతకు ముందు 11(3) ఆప్షన్ లెటర్ ఇచ్చారా అని అడుగుతోంది. ఇవ్వలేదు అన్న తరువాత ఆప్షన్ లెటర్‌ను పూర్తి చెయ్యటం ముందుకు కదలటం లేదు. సుప్రీం కోర్టు తీర్పును కాదనకుండా కొంత కాలం అటు ఇటూ నడిపించి మరలా సుప్రీంకోర్టుకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నది.

2014 నోటిఫికేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. పైగా చట్టాల జోలికి తాము పోలేమని చెప్పింది. దాంతో ఆ నోటిఫికేషన్‌లో ఉన్న పెన్షనర్ల వ్యతిరేక క్లాజులు అన్నీ యథాతథంగా కొనసాగుతాయి. కాని 1.16 శాతం ఉద్యోగి కట్టాలి అని చెప్పటం మాత్రమే చట్టవ్యతిరేకమన్నది. 1.16 శాతం ఎవరు కట్టాలో ఇతమిద్ధంగా తేల్చకుండా వదిలేసింది. ఈలోగా ఉద్యోగుల నుండి వసూలు కొనసాగుతున్నది. ఈ భాగం కూడా మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా, కేరళ హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ఉన్నది.

2022 నవంబర్ 4 సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన సమయంలో...ఇపిఎస్ పెన్షనర్లకు పెద్ద మొత్తంలో పెన్షన్‌లు పెరగబోతున్నట్లు ఒక ప్రధాన తెలుగు పత్రిక శీర్షికలు పెట్టింది. మరి కొంతకాలానికి అదే పత్రిక ఇపిఎఫ్ సంస్థ ఇపిఎస్ పెన్షనర్లకు షాక్ ఇచ్చినట్లుగా వార్తలు ప్రచురించింది. మరోపక్క సంఘపరివార సంస్థలు ఇపిఎస్ పెన్షనర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ఇప్పటికీ కొంత మంది పెన్షనర్లు తమకు త్వరలోనే నెలకు రూ.5 వేలు లేదా రూ.7 వేలకు పెన్షన్ పెరుగుతుందని ఎదురుచూస్తున్నారు. సంఘపరివార సంస్థలు గుర్రానికి పచ్చగడ్డి చూపించి పరిగెత్తిస్తున్నాయి.

మోడీ ప్రభుత్వం సామాజిక భద్రతా కోడ్‌లో ఎంప్లాయి పెన్షన్ స్కీమ్‌ను, ఇఎస్‌ఐ స్కీమ్‌లను నోటిఫికేషన్ ద్వారా మార్చివేసే అధికారం తీసుకుంది. నోటిఫికేషన్ మార్చిన తరువాత పార్లమెంట్‌కు కూడా వెళ్ళాల్సిన అవసరం కూడా లేకుండా కోడ్‌లో మార్పులు చేసింది. రూ.లక్షల కోట్లు ఉన్న ఇపిఎఫ్, ఇపిఎస్, ఇఎస్‌ఐ నిధులను ప్రైవేటు ఫండ్ మేనేజర్లకు, ప్రైవేటు మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్తం చెయ్యాలని చూస్తోంది.


ఇటువంటి సమయంలో ఇపిఎస్ పెన్షనర్లు మాత్రమే కాకుండా సమస్త పెన్షనర్లు ఐక్యమై పెన్షన్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ పోరాటాలు నడపాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు ఇన్సూరెన్స్ ఉద్యోగులు సిపిఎస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ ను రద్దు చేసి వాటి ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చెయ్యటానికి చర్యలు తీసుకుంటున్నాయి. మోడీ ప్రభుత్వం సిపిఎస్ లో ఉన్న నిధులను బదిలీ చెయ్యటం కుదరదని ప్రకటించింది. ఈ ప్రకటన చేసిన కొన్ని రోజుల్లోనే మోడీ ప్రభుత్వం తన ప్రకటన మార్చుకుంది. 2004కు ముందు కేంద్ర ప్రభుత్వ శాఖలలో రిక్రూట్ అయ్యి 2004లో నియామకం పొందిన వారిని సిపిఎస్ నుండి ఒపిఎస్‌కు మార్చటానికి కోర్టు తీర్పుల మేరకు సిద్ధమైంది. ఆ ఉద్యోగులకు సిపిఎస్ లో ఉన్న వారి వాటాలను వారి జిపిఎఫ్‌కు బదిలీ చెయ్యాలని నిర్ణయించింది.

పోరాడితే కొన్ని ప్రయోజనాలు సాధించవచ్చని అన్ని రకాల పెన్షనర్ల అనుభవాలు తెలియజేస్తున్నాయి. ఇపిఎస్ పెన్షనర్లు తమకు జరిగిన అన్యాయంపై పోరాడటానికి సిద్ధం కావాలి. కేవలం కోర్టు తీర్పుల మీదనే ఆధారపడకుండా అందరు పెన్షనర్లను కలుపుకొని ఐక్య పోరాటాలు చెయ్యాలి. కనీస పెన్షన్ పెంపు కోసం, డి.ఎ కోసం పోరాడాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

బహుముఖ ప్రతిభాశాలి, రచయిత్రి కె.రామలక్ష్మి

నివాళి



తె.ర

ఈ నెల రెండవ తేదీన కన్నుమూసిన కె.రామలక్ష్మి తొలి తరం పాత్రికేయురాలు, రచయిత్రి. ఆనాటి మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగు సాహిత్య ప్రతినిధిగానే గాక స్నేహశీలిగా విస్తృత పరిచయాలతో ఆమె కీలక పాత్ర పోషించారు. ప్రముఖ రచయిత, పరిశోధకుడు ఆరుద్ర సతీమణిగా ఆయన అపార కృషికి అండదండలందించారు. కాకినాడ జిల్లా కోట నందూర్‌లో 1930 డిసెంబర్ 31న పుట్టిన రామలక్ష్మి బి.ఎ పట్టభద్రురాలు. అప్పటికే ఆంధ్ర ఆంగ్ల భాషలలో ఆమెకు మంచి పట్టుండేది. ఖాసా సుబ్బారావు సంపాదకత్వంలోని స్వతంత్ర పత్రిక ఆంగ్ల విభాగంలో ఆమె పనిచేశారు. తెలుగులో గోరా శాస్త్రి చూస్తుండేవారు. అప్పట్లోనే ఆమె సమీక్షలు రాసేవారు. సి.నారాయణరెడ్డి కొత్తలో రాసిన 'నవ్వని పువ్వు' కావ్యాన్ని సమీక్షిస్తూ 'ఈ కవి నవ్వని పువ్వు' అని రాయడం చాలా మంది చెప్పుకునేవారు. గేయం రాయాలి నేను గేయం రాయాలి అని వర్ణిస్తూ ఒక కవిత రాస్తే ఆమె తన సమీక్షలో అదేదో రాసేస్తే అయిపోతుంది కదా అని చమత్కరించడాన్ని ఆయనే నవ్వుకునేవారు. ఆ రోజులలో కృష్ణశాస్త్రి, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ వంటి వారితో బాగా సన్నిహితంగా మెలిగేవారు. 1954లో శ్రీశ్రీ, టాకీపులి హెచ్.ఎం రెడ్డి సాక్షి సంతకాలతో ఆమెకూ ఆరుద్రకూ పెళ్లి జరిగింది. వారికి ముగ్గురు కుమార్తెలు.

1954లోనే ఆమె తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' ప్రచురించారు. ఆ రోజులలోనే ఆరుద్రకు సన్నిహితుడైన ప్రసిద్ధ రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి సూచనతో నవలా రచనవైపు మళ్లారు. ఈ గాజులు తొడిగించుకునే కథలు ఎన్ని రాసినా ఒకటే, కొత్త పంథా వైపు మరలడానికి ప్రయత్నించు అని ఆయన అన్నారని ఆమే చెప్పుకున్నారు. ఆ క్రమంలో రూపొందిన పార్వతీ కృష్ణమూర్తి కథలు సాహిత్యాభిమానుల అమితాదరణ పొందాయి. ఈ జంట తెలుగు సాహిత్యంలో నిలిచిపోతుంది చూడండని ఆయన మెచ్చుకున్నందుకు చాలా సంతోషించారట. ఆ సలహా తన ఆలోచనా ధోరణిని మార్చిందని కూడా చెప్పుకున్నారు. ఆంధ్రపత్రికలో రామలక్ష్మి ప్రశ్నలు జవాబుల శీర్షిక చాలా ప్రసిద్ధి. మాలతీ చందూర్ ఆంధ్రప్రభలో ప్రమదావనం పేరిట ఇచ్చే జవాబుల కన్నా రామలక్ష్మి ఆధునికంగా స్పందించేవారు. చెన్నైలో చివరి వరకూ వారు స్నేహంగా వున్నారు. స్త్రీల సమస్యల గురించి లేదా తర్వాతి కాలంలో స్త్రీవాదం గురించి చర్చలు మొదలవడం కన్నా బాగా ముందే రామలక్ష్మి జీవితంలోనూ సాహిత్యంలోనూ మహిళల గొంతు వినిపించారు.

శ్రీశ్రీ ఆరుద్రల బంధుత్వం, సాహిత్య సాన్నిహిత్యం రీత్యా ఆ కుటుంబానికి చాలా దగ్గరగా వుండేవారు. అయితే వ్యక్తిగత అలవాట్లే గాక రాజకీయ సిద్ధాంతాల రీత్యా కూడా రామలక్ష్మి ఆయనతో విభేదించారు. ఆమె అభ్యుదయ సాహిత్య శిబిరంలో కీలక పాత్ర వహించిన వ్యక్తి కాదు. శ్రీశ్రీతో వివాదపడేవారు. అయితే కుటుంబాల పరంగా ఎందరికో మరీ ముఖ్యంగా మహిళలకు దగ్గరగా వుండేవారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత తల్లి సంధ్యతో స్నేహం కారణంగా ఆమెను చిన్నప్పటి నుంచి చూశారు. ఆరుద్ర 'గూఢచారి 116' చిత్రంలో తనకు పాట రాస్తే జయలలిత ఎంత సంతోషించిందని చెబుతుంటారు. మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, అలనాటి అనేకమంది దర్శకులు, రచయితలు, సంగీత దర్శకులు వారి స్నేహితులే. సుందరయ్య గారి గురించి చాలా గౌరవంగా చెప్పేవారు. భానుమతి, బాపు రమణ, ఎన్టీఆర్ సతీమణి బసవ తారకం వంటి వారి గురించీ అనేక విషయాలు చెప్పేవారు. సినిమా రంగంలో స్త్రీల పరిస్థితి ఆమెను ఆవేదనకు గురిచేసింది. ప్రసిద్ధ కవులు, రచయితలు, ప్రచురణకర్తల భార్యల దుస్థితిని బాహాటంగా విమర్శించేవారు. ఆత్రేయ భార్య వంటలు చేసి బతకడం వంటి పరిస్థితి జీర్ణించుకోలేకపోయారు. మలి దశలో రాసిన 'వెలిసిపోయిన దాంపత్యాలు' నవలలో ఈ తరహా జీవితాలను చిత్రించారు. 70, 80 దశకాల లోని రచయిత్రులలో ఒకరుగా వున్న రామలక్ష్మి ఆ అంశాలను ప్రస్తావించారు.

ఆరుద్ర సినిమాలకు పాటలు, మాటలు రాస్తే రామలక్ష్మి కథలు సమకూర్చారు. వాటిలో విశ్వనాథ్ తీసిన 'జీవన జ్యోతి', దాసరి నారాయణరావు 'గోరింటాకు' ముఖ్యమైనవి. 'జీవన జ్యోతి' చిత్రానికి 1975లో నంది పురస్కారం అందుకున్నారు. దాసరి కథా విభాగంలో సహకరించేవారు. వాణిశ్రీ ఆమెకు బాగా సన్నిహితం. గోరింటాకు కథలో కీలక కథాంశం రంగనాయకమ్మ రాసిన 'ఇదే నా న్యాయం' అన్న కథను పోలి వుండటంతో కోర్టు వివాదం నడిచింది. శోభన్ బాబు ఆమెను బాగా అభిమానించేవారు. ఎవరినైనా ముక్కుసూటిగా విమర్శించే రామలక్ష్మి ధోరణి కొందరికి రుచించేది కాదు. అయితే అభివృద్ధి నిరోధకంగా, పాలకులకు వంతపాడటం చేసిన వ్యక్తి కాదామె. శ్రీశ్రీతో జరిగిన వాదవివాదాలలో ఆమెను ఆయన తాటకేశ్వరి అని పేర్కొన్నారు. ఆ తర్వాత శ్రీశ్రీని ఇకపై ఏమీ అనబోనని ఆమె ఆరుద్రకు మాట ఇచ్చారట. అయితే తన రెండవ కుమార్తె రౌద్రి కవిత్వానికి ఆయనతో ముందుమాట రాయించుకోవడానికి స్వయంగా కలిసి అడగటానికి ఆమే వెళ్లారు. ఆయనా చాలా అభిమానంగా రాశారు! రామలక్ష్మి సెన్సార్‌బోర్డు సభ్యురాలుగా దీర్ఘకాలం పనిచేశారు. ఆ విధంగా ఎందరో నిర్మాతలకు సాయపడ్డారు. కరుణానిధి రాసిన కన్నగి నవల హక్కులు తీసుకుని అనువాదం చేశారు. సాహిత్యం లోతుపాతులు, గుణదోషాలు చక్కగా అంచనా వేసేవారు.

నాటి మద్రాసులో ఆరుద్ర, రామలక్ష్మి మద్రాసు పరిచయం గల తెలుగువారికి, సాహిత్య సినీ జీవులకు పెద్ద దిక్కుగా వుండేవారు. ఆమె ఆయనను అబ్బాయ్ అంటే ఆయన రామా అనేవారు. చివరి వరకూ వారు అలాగే అన్యోన్యంగా జీవించారు. 1985లో ఆయన షష్టిపూర్తికి ప్రజాశక్తి 'ప్రజాకళలు ప్రగతివాదులు' పుస్తకం ప్రచురించింది. ఆ కాపీలు తీసుకుని మద్రాసు వెళ్లి రాణీ సీతల్ హాలులో జరిగిన వేడుకల్లో పాల్గొన్నాను. ఈ అబ్బాయి అమ్మాయి అని సినారె వారిని సంబోధిస్తే హాలు కరతాళ ధ్వనులతో మార్మోగింది. ఆయనకు డయాలిసిస్ అవసరమైన సమయంలో హైదరాబాదులో వుండి చికిత్స జరిపించారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం ప్రజాశక్తి ప్రచురించిన సందర్భంగా నేను అప్పుడప్పుడు కలిసేవాణ్ని, ఆరుద్ర విజయవాడ వచ్చినప్పుడల్లా బొమ్మారెడ్డిగారితో పాటు వెళ్తుండేవాణ్ని. తను కమ్యూనిస్టు కాకున్నా రామలక్ష్మి గారు ఎంతో ఆదరంగా చూసేవారు. తర్వాతి కాలంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో తెలుగు అకాడమీ సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాలను ప్రచురించింది. ఆమె వాటిని మరోసారి సరిచూసి అందంగా తీసుకొచ్చారు.

2018లో ఈ రచయితకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె అనేక విషయాలపై తన అభిప్రాయాలు అనుభవాలు చెప్పారు. ప్రస్థానంకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ తను అభ్యుదయ భావాలకు వ్యతిరేకిని కానని స్పష్టం చేశారు. నిజానికి యూట్యూబ్‌లో ఆమె ఇంటర్వ్యూ ప్రసారమయ్యే వరకూ ఆమె హైదరాబాదులో వుంటున్నట్టు దాదాపు ఎవరికీ తెలియదు, అందులో ఒక పదం అనుకున్నట్టు ఎడిట్ కాకపోవడంపై విమర్శలు వచ్చాయి గాని ఆమె ఆ వయసులో అంత దృఢంగా స్పష్టంగా అభిప్రాయాలు చెప్పడం సంచలనం సృష్టించింది. యూ ట్యూబ్‌లో సైతం బాగా ట్రెండింగ్‌లోకి వచ్చి తమిళనాడు లోనూ వైరల్ అయింది. ఇప్పటికీ అది నడుస్తూనే వుంటుంది. అయితే తర్వాత మళ్లీ ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. ఇటీవల ఆరో ముద్రణ పొందిన శ్రీశ్రీ జయభేరి ఆరుద్రకు అంకితమిచ్చాను. ఈ విషయం రామలక్ష్మి గారికి చెప్పి మొదటి ముద్రణ కాపీ అందజేస్తే ధన్యవాదాలు చెప్పారు. వెంటనే చదివేసి బాగా రాశావయ్యా అన్నారు. చివరి వరకూ బాగా పుస్తకాలు పత్రికలు చదువుతుండేవారు. ఎవరిమీద ఆధారపడకుండా వంటరిగా సహాయకురాలి తోడుతో జీవితం గడిపారు. ఆరుద్ర ఆఖరి కోర్కె ప్రకారం ఆయన మరణానంతరం ఎలాంటి హడావుడి లేకుండా అంత్యక్రియలు పూర్తి చేసిన రామలక్ష్మి తనూ అలాగే ఎవరికీ కనిపించకుండా సెలవు తీసుకున్నారు. పెద్ద కుమార్తె కవిత ఆరు మాసాల పాటు దగ్గరుండి సపర్యలు చేస్తూ తుది వీడ్కోలు పలికారు. ప్రపంచానికి చెప్పడం తమ బాధ్యత గనక చెప్పానని ఆమెను పరామర్శించినపుడు చెప్పారు. ఆ తర్వాతే మీడియాకు తెలిసింది. రెండవ కుమార్తె, కవయిత్రి రౌద్రి అయిదారేళ్ల కిందటే క్యాన్సర్‌తో కన్నుమూశారు. మరో కుమార్తె విదేశాలలో వున్నారు.

ఆమెను కేవలం ఆరుద్ర సతీమణి అని మాత్రమే కొందరు రాయడం చాలామందికి మింగుడు పడకపోవడం సమర్థనీయమే. డెబ్బై ఏళ్లనాడే రచనలు చేసిన ఆధునిక మహిళగా, బహుముఖ ప్రతిభామూర్తిగా, ఆరుద్రకు తోడు నిలిచిన సహచరిగా రామలక్ష్మి గారు చిరకాలం గుర్తుంటారు.

★

కవిత్వం

కొత్త రెక్కల మొలకలు

నువ్వు ఎప్పుడైనా చూశావా?
అప్పుడే పుట్టిన శిశువులు మాట్లాడడం
నువ్వు ఎప్పుడైనా విన్నావా?
కాకులు గుసగుసలాడటం
ఒక కొండపై తప్పిపోయిన గొర్రె పొట్టేలు
అరుస్తుంది
చూసీ చూడనట్టు మన గమ్యాలకు పోతుంటాం
రోడ్డుపై ఒక వ్యాధిగ్రస్తుడు నిల్చున్నాడు
ఒక తాగుబోతు దారిలో పడున్నాడు
ఒక పెళ్లి గుంపు నృత్యం చేస్తూ వెలిగిపోతుంది
పిచ్చివాడు పారేసిన విస్తర్లను చుట్టుకుంటున్నాడు
విడివిడిగా ఉన్న రెండు మూకలు
కొట్టుకుంటున్నాయి
ప్రజాస్వామ్యం జోరు వానలో కాలువలై
పారుతుంది
హక్కులు కోల్పోయిన రెక్కలు
చీకటి గదుల్లో కుట్లేసుకుంటున్నాయి
ఇవైనా విన్నావా పోనీ.. చూసావా సాక్ష్యుల్ని...
అధికారం పంచబడింది
అహంకారం కూల్చబడింది
అయినా నాయకత్వం పల్చబడింది
ఒక కాలం ఇంకో కాలాన్ని
కాటేస్తూ మింగుతూ అస్తిత్వంలోకి వస్తుంది
అది మళ్లీ పక్కానికి వచ్చేసరికల్లా
ఇంకొన్ని రంగులు పులమబడి
వ్యాప్తి చెంది ఉంటాయి
స్టేషన్లలో అడ్డాల్లో చౌరాస్తాల్లో
దీనంగా మొహాలు మోడుబారుతున్నాయి
వారి దేహం లోంచి ఒక కొత్త చెట్టు
మొలవడానికి కొన్నాళ్ళు పట్టుద్ది
వచ్చిన వారు నరికేసుకుని పోతారు
ఇక వీరికై వీరు చిగురించాల్సిందే
ఇంతా అయ్యాక విధులను బాధ్యతలను
ఎరగకపోతే
స్థితిగతులను కనకపోతే...
అలాగే ఉంటూ ఈడుస్తూ రాలిపోతావా
ఎండిన కొమ్మల్ని మిగుల్చుతూ..!?
ఇదేనా కలగన్నది నువ్వు..!!?

- రఘు వగ్గు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

కొలంబియా బొగ్గు గనిలో పేలుడు : 11మంది మృతి

బొగోటా : సెంట్రల్ కొలంబియాలోని బొగ్గు గనిలో తీవ్రమైన పేలుడు సంభవించడంతో 11మంది మరణించారు. మరికొంతమంది గల్లంతయ్యారని ప్రభుత్వం బుధవారం తెలిపింది. ఈ పేలుడు ధాటికి సొరంగాలతో కలిపి వున్న మరో నాలుగు గనులు కూడా దెబ్బతిన్నాయి. గనిలో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు సహాయక సిబ్బంది శ్రమిస్తున్నారని అధ్యక్షుడు గుస్తావో పెట్రో ట్విట్టర్‌లో తెలిపారు. మంగళవారం రాత్రి ఈ పేలుడు సంభవించింది. తొలుత నలుగురు మరణించారు. ఇద్దరిని కాపాడినట్లు ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు. అప్పటికి ఇంకా గనిలో 17మంది చిక్కుకుపోయి వున్నారని పేర్కొన్నారు. సొరంగాలతో అనుసంధానమై వున్న ఐదు గనుల్లో ఈ పేలుడు ధాటికి వరుస పేలుళ్లు సంభవించాయన్నారు. కొలంబియా బొగ్గు గనుల్లో పేలుళ్ళు, పెళ్ళలు విరిగిపడడం వంటి ప్రమాదాలు సర్వసాధారణం.

ఇడి పగలే విచారించాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో నిధుల దుర్వినియోగం కేసులో నిందితులు నలుగురిని పగటి పూట విచారణ చేయాలని ఇడికి హైకోర్టు ఆదేశించింది. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలోనే విచారణ చేయాలంది. ఈ మేరకు జస్టిస్ శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సౌమ్యాద్రి శేఖర్ బోస్ (కోల్‌కతా), వికాస్ వినాయక్ (పూణె), ముఖుల్ చంద్ర అగర్వాల్ (ఢిల్లీ), సురేష్ గోయల్ (ఢిల్లీ) దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన జడ్జి పైవిధంగా ఇడికి ఆదేశాలు జారీ చేశారు. ఆ నలుగురినీ ఇడి కస్టడీకి ఇస్తూ విశాఖ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో రాత్రిళ్లు ఇడి విచారణ చేయడాన్ని సవాల్ చేస్తూ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ ఈ నెల 16కు వాయిదా పడింది.

పబ్లిక్ నోటీసు

ICICI Home Finance | రిజిస్టర్డ్ ఆఫీస్: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్) ముంబయి 400051

కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్స్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి ఈస్ట్, ముంబాయి-400059
శాఖ కార్యాలయం: సుప్రియ టవర్స్, 1వ అంతస్తు, డో.నం.5-37-155, 4 15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002

దిగువ రుణగ్రహీత/లు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ("ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి") నుండి వారి ద్వారా రుణాల సౌకర్యాలు అసలు మరియు వడ్డీ తిరిగిచెల్లించుటలో విఫలమైనారు మరియు రుణాలు నాన్-ఫర్ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడినాయి. వారి చివరిగా తెలిసిన చిరునామాల మీద సెక్షన్ 13 (2) యొక్క సెక్యూరిటీజైషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 క్రింద నోటీసు జారీచేయబడింది, అయినప్పటికీ ఇది తీసుకొనబడలేదు మరియు కావునా పబ్లిక్ నోటీసు ద్వారా వారు ఇక్కడ గమనించవలసిందిగా కోరుతున్నాము.

క్ర. సం	రుణగ్రహీత/సహరుణగ్రహీత/హామీదారు/(రుణఖాతా నెం)/చిరునామా	సెక్యూర్డ్ అస్సెట్ ఆస్థి చిరునామా/ అమలుచేయబడిన ఆస్థి	పంపబడిన నోటీసు తేదీ/నోటీసు తేదినాటికి బకాయిలు	ఎన్‌పిఎ తేది:
1.	కల్ల మురళీ బాబు (రుణగ్రహీత), కల్ల మాల్యాద్రి (సహ రుణగ్రహీత), 19 9 71 చాకలి గుంట పోలేరమ్మ గుడి వద్ద గాంధీనగర్ 2వ లైన్ ఏల్కూరు రోడ్డు గుంటూరు, గుంటూరు-522003. LHGTR00001411743	డో.నం. 60-7-308, మాచిరాజి వారి వీధి పాత గుంటూరు, రామాలయం వద్ద, 158, గుంటూరు-522001 హద్దులు: ఉత్తరం: జె. శ్రీనివాసరావు యొక్క ఆస్తి, దక్షిణం: ఇతరుల యొక్క ఆస్తి, తూర్పు: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, పడమర: చిన్ని గురవయ్య సత్యం రామయ్య యొక్క ఆస్తి.	08-02-2023 Rs. 30,74,304/-	08-01-2023
2.	పువ్వాడ మోహిని (రుణగ్రహీత), చలువాది మధు వెంకట నాగ స్వామి (సహ రుణగ్రహీత), 8 10 308ఏ 1వ లైన్ నెహ్రూ నగర్ కొత్త పేట గుంటూరు గుంటూరు-522001. LHGTR00001445593	డో.నం.8-6, బొంతపాడు, ఏట్కూరు, గుంటూరు, టెన్యూర్: 486 డో.నం.179-2, గుంటూరు-522004. హద్దులు: ఉత్తరం: ఆవుల సాంబ్రాజ్యమ్మ, దక్షిణం: కొంక రామకృష్ణ, తూర్పు: 4 అడుగుల వెడల్పు నడక దారి, పడమర: ముప్వ రోసయ్య.	08-02-2023 Rs. 24,17,321/-	08-01-2023

నోటీసు సర్వీసు ప్రత్యమ్నాయం కొరకు ముందడగు వేయడమైనది. పై రుణగ్రహీత/లు మరియు వారి హామీదారులు (వర్తించబడతారు) ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60 రోజులలోపట బకాయిలు చెల్లించవలసిందిగా కోరుతున్నాము లేనియెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరిగా మందడగు వేయడం జరుగుతుంది.

తేది : 16 మార్చి, 2023
ప్రదేశం: గుంటూరు
ఆధీకృత అధికారి,
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్.

వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

varthana

(గతంలో మెసర్స్ తిరుమెని ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పేరుగలది)
రిజిస్టర్డు ఆఫీసు: నం.5బిసి-110, వరసిద్ధి, 3వ అంతస్తు, ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డు, 3వ బ్లాక్, హెచ్‌ఆర్‌బిఆర్ లేఔట్, కళ్యాణ్ నగర్, బెంగళూరు-560043.Website www.varthana.com, Email: care@varthana.com Phone: 080-68455777,
బ్రాంచి ఆఫీసు: డా॥ రాజేశ్ కాంప్లెక్స్, డోర్ నం.73-7-12, విజయ హాస్పిటల్ ప్రక్కన, డొంక రోడ్, పటమట, వేంకటేశ్వరపురం, విజయవాడ- కృష్ణా జిల్లా-520010.

స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ '(6)తో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్& ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం అమ్మకపు ప్రకటన. ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు& తాకట్టుదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు/చార్జ్ చేయబడినది. ఏద్రైతే, దానిని **మెసర్స్ వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (గతంలో తిరుమెని ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా పేరుగలది) నెల్లూరు,** యొక్క అధీకృత అధికారిచే స్వాధీనంచేసుకోబడినది, దిగువ పేర్కొన్న రుణ ఖాతాలలోగల బకాయి మొత్తాల రికవరీచేయుట కొరకు **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన **25.04.2023 (మంగళ వారం)**న **మ॥ 1.00గం.లు నుండి మ॥ 2.00గం.ల** మధ్య విక్రయించబడుతుంది. రుణగ్రహీతల/తాకట్టుదారుల/సెక్యూర్డ్ అసెట్స్/బకాయిలు/రిజర్వుధర/వేలం తేది& సమయం, ధరావత్తు& బిడ్ పెంపుదల మొత్తాల వివరాలు దిగువ పేర్కొనబడినవి:

రుణగ్రహీతల/తాకట్టుదారుల పేరు: 1) మెసర్స్ వుయ్యూరు ఇ.ఎం. హై స్కూల్, ప్రతినిధియైన అధీకృత సంతకందారు, **2) మెసర్స్ ఎం.కె.గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సొసైటీ,** ప్రతినిధియైన అధీకృత సంతకందారు, **3) శ్రీ కర్మిల బాబు మంగటి,** తండ్రి వీరభద్ర రావు, **4) శ్రీమతి మంగటి మాధురి,** భర్త శివ్ చరన్ సింగ్.
Loan A/c. No's. S18HYD-VIJ-003710, U20VIJ-VIJ-015355, U21VIJ-VIJ-016373 and U21VIJ-VIJ-018292.

పూర్తి బకాయి మొత్తాల వివరాలు రూపాలలో: 06.03.2023 నాటికి **రూ.61,23,561/- (రూపాయలు అరవై ఒక లక్షల ఇరువై మూడు వేల ఐదు వందల అరవై ఒకటి మాత్రమే)** లతోపాటు పూర్తి మొత్తాల రియలైజేషన్ వరకు అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీ ప్లస్ లీగల్ ఖర్చులు/చార్జీలుతోసహా.

స్థిరాస్తి వివరాలు: క్రిష్ణా జిల్లా, పామిడిముక్కల మండలం, తాడంకి, డోరు నం.6-48 వద్దగల ఆరు.ఎస్సు నం.1/9ఎ లో 532.4చ.గ.లు లేదా 445.08చ.మీ.ల విస్తీర్ణంగల సైటు యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: పంచాయతి బజారు, పడమర: చలపతి శివ శ్రీనివాస రావు ఆస్తి, ఉత్తరం: తాళ్లపల్లి నరసింహా రావు ఆస్తి, దక్షిణం: బజారు.
పై షెడ్యూల్డు ఆస్తి రిజర్వు ధర రూ.23,35,521/- (రూపాయలు ఇరువై మూడు లక్షల ముప్పై ఐదు వేలు ఐదు వందల ఇరువై ఒకటి మాత్రమే) మరియు ధరావత్తు (ఇఎండి రిజర్వుధరలో 10% ధరావత్తు) రూ.2,33,552/-.
తెలిసిన ఏవేని రుణభారాలు: నిల్.

ఆసక్తిగల బిడ్డరుదారులు కెవైసి పత్రాల (పాన్ కార్డు& ఆధార్/ఓటర్స్ ఐడి/డ్రైవింగ్ లైసెన్స్)తోపాటు వారి ధరావత్తు మొత్తాలు మరియు బిడ్ మొత్తాలను దాఖలుచేయవలెను మరియు **"మెసర్స్ వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్"** పేరున **విజయవాడ వద్ద చెల్లుబడునట్లుగా 24.04.2023 (సోమవారం)న లేదా ముందుగా** ఏదేని షెడ్యూల్డు బ్యాంకు పై తీసిన డిమాండ్ డ్రాఫ్టు/పేఆర్డర్ రూపేనా నాన్-రిఫండబుల్ టెండరు ఫీజు రూ.1,000/-లను దాఖలుచేయవలెను.

వేలం వేయు వేదిక: మెసర్స్ వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, డా॥ రాజేశు కాంప్లెక్సు, డోరు నం.73-7-12, విజయ హాస్పిటలు ప్రక్కన, డొంక రోడ్డు, పటమట, వెంకటేశ్వరపురం, విజయవాడ-క్రిష్ణా జిల్లా వద్ద 25.04.2023 (మంగళవారం) మ॥1.00గం.లు నుండి మ.2.00 గం.ల మధ్య.

ఆసక్తిగల బిడ్డరుదారులు తదుపరి వివరాలు/ సమాచారం కొరకు, అధీకృత అధికారి, శ్రీ అభిషేక్ కుమార్- ఫోన్ నం.9133199333, శ్రీమంద్రు జ్ఞాన నంద కుమార్ మరియు శ్రీ యేడుకొండలు- ఫోన్ నం.7306981632 మరియు పై సంప్రదించవచ్చును.
అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& నిబంధనల కొరకు, దయచేసి కంపెనీ యొక్క వెబ్‌సైట్ అనగా.,www.varthana.comలో ఇవ్వబడిన లింకును రెఫర్ చేయగలరు.

తేది: 16.03.2023, ప్రదేశం: బెంగళూరు
అధీకృత అధికారి, వర్ధన ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్.

పబ్లిక్ నోటీసు

ICICI Bank | శాఖా కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసుర్, మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068.

దిగువ రుణగ్రహీత/లు బ్యాంక్ నుండి వారి ద్వారా రుణాల సౌకర్యాలు అసలు మరియు వడ్డీ తిరిగిచెల్లించుటలో విఫలమైనారు మరియు రుణాలు నాన్-ఫర్ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడినాయి. వారి చివరిగా తెలిసిన చిరునామాల మీద సెక్షన్ 13 (2) యొక్క సెక్యూరిటీజైషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 క్రింద నోటీసు జారీచేయబడింది, అయినప్పటికీ ఇది తీసుకొనబడలేదు మరియు కావునా పబ్లిక్ నోటీసు ద్వారా వారు ఇక్కడ గమనించవలసిందిగా కోరుతున్నాము.

క్ర. సం	రుణగ్రహీత/సహా-రుణగ్రహీత/ హామీదారుడు/(లోను ఖాతా నంబర్) మరియు చిరునామా	సెక్యూర్డ్ అస్సెట్ ఆస్థి చిరునామా/అమలుచేయబడిన ఆస్థి	పంపబడిన నోటీసు తేదీ/నోటీసు తేది నాటికి బకాయిలు	ఎన్‌పిఎ తేది
1.	జొన్నల రాఘవేంద్రారెడ్డి/ పరమేశ్వరరెడ్డి జొన్నల/ జొన్నల ప్రభావతి/ జొన్నల భార్గవి/ డో.నం.12-8-8 కోగంటి వెంకటప్పయ్య వీధి పాండురంగ పేట, తెనాలి, గుంటూరు-522201/ LBTEN00005141829	ఆస్తి యొక్క షెడ్యూల్: గుంటూరు జిల్లా -522201, తెనాలి మున్సిపాలిటీ, ఎక్స్‌టెంషన్ ఏరియా నం.31-7-29, తెనాలి రోడ్డు ఇలక లో కలిసి, తెనాలి గ్రామం తాలూక, మింజుమల్ దోరు ఏరియా వద్ద ఉన్న మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ ఓపెన్ ప్లాట్ కొలిచే ఖాళీ ప్లాట్ వైడ్, డో.నం.39/2, డో.నం.39/3, డో.నం.39/4 కొలిచే 268-25 చ.అడుగులు. లేదా 222.64 చ.మీటర్లు. మరియు క్రింది విధమైన హద్దులు: మొత్తం ప్లాట్ కొరకు సరిహద్దులు: ఉత్తరం: రవి హైమారావు ప్లాట్ సరిహద్దు 55-6 అడుగులు., దక్షిణం: కంద్రిక రామ మోహనరావు ఆస్తి సరిహద్దు 55-6 అడుగులు., తూర్పు: గడ్డిపాటి శోభారాణి ప్లాట్ సరిహద్దు 44 అడుగుఉల., పడమర: 30 అడుగుల వెడల్పు రోడ్డు పరిధి 43-0 అడుగులు. ఈ సరిహద్దుల ఖాళీ ప్లాట్ మధ్య కొలిచే 268-25 చ.అడుగులు. లేదా 222.64 చ.మీటర్లు. ఈ రోజు మీకు మీ స్వాధీనం కొరకు విక్రయించిన మొత్తం సౌలభ్య హక్కులు. విక్రయించబడిన ఆస్తి యొక్క పడమర మరియు దక్షిణం ద్వారా 30 వెడల్పు ఉమ్మడి కారిడార్, తెనాలి నుండి నారాకోడూరు రోడ్డుకు దక్షిణంగా తూర్పు డొంక దారి, ఈ సమయం నుండి మీరు పేర్కొన్న ఆస్తి యొక్క రంగు నీటిని మరియు ఉపయోగించిన నీటిని పేర్కొన్న బజార్ వైపు ట్యాంక్ ద్వారా విడుదల చేయాలి.	13/01/2023 Rs. 28,73,866/-	03/10/2022

నోటీసు సర్వీసు ప్రత్యమ్నాయం కొరకు ముందడగు వేయడమైనది. పై రుణగ్రహీత/లు మరియు వారి హామీదారులు (వర్తించబడతారు) ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60 రోజులలోపట బకాయిలు చెల్లించవలసిందిగా కోరుతున్నాము లేనియెడల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరిగా మందడగు వేయడం జరుగుతుంది.

తేది: 16 మార్చి, 2023,
ప్రదేశం: గుంటూరు మరియు తెనాలి.
ఆధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

AXIS BANK LIMITED

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003.

స్వాధీనతా ప్రకటన రూల్8(1) క్రింద (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 22/1223/ఎ-1, 1వ అంతస్తు, జి.టి.రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్-524003.** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, దిగువ రుణగ్రహీతలను సదరు రుణఖాతాకు ఎదురుగా పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా డిమాండ్ నోటీసులును జారీచేశారు.

క్ర. సం.	దరఖాస్తుదారు/సహదరఖాస్తుదారు/ హామీదారుల పేరు/ఖాతా నెం.	బకాయి రూ.లలో	ఆఫర్‌చేసిన ఈక్విటేబుల్ తాకట్టుపెట్టిన ఆస్తి
1	**1. శ్రీ నూకారపు రామ శేషగిరి రావు,** 4-5-29/116ఎ, 3వ లైన్, సాయిబాబా టెంపుల్ దగ్గర, విద్యా నగర్, చంద్రమౌళి నగర్, గుంటూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522007. **2. శ్రీమతి కావూరి జయలక్ష్మి,** 4-5-29/116ఎ, 3వ లైన్, సాయిబాబా టెంపుల్ దగ్గర, విద్యా నగర్, చంద్రమౌళి నగర్, గుంటూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522007. A/C No: -915030005866247 డిమాండ్ నోటీసు తేది: 30.03.2022, స్వాధీనతా ప్రకటన తేది: 09.03.2023.	Rs.28,22,434/- (రూపాయలు ఇరువై ఎనిమిది లక్షల ఇరువై రెండు వేల నాలుగు వందల ముప్పై నాలుగు మాత్రమే)	గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ, ఏ.టి.అగ్రహారం, వెంకట రమణ కాలని లో డోర్ నం.26-45-16/150 దగ్గరలో నల్లపాడు ఏరియా, సర్వే నం.157/ఎ లోగల ప్లాట్ నం.6లో 412చ.గ.ల విస్తీర్ణపు ఆస్తి మొత్తం భాగం మరియు **సరిహద్దులు: తూర్పు:** పర్వతనేని సుఖదేవ్ సైటు, **దక్షిణం:** దుగ్గెంపుడి గోవిందమ్మ సైటు, **పడమర:** దుగ్గెంపుడి వీరా రెడ్డి సైటు, **ఉత్తరం:** 28అ.ల వెడల్పు రోడ్డు.
3	**1. శ్రీ ఆకుల సత్యనారాయణ** తండ్రి ఆకుల పాండు రంగారావు, డోర్ నం.జి3, 1వ అంతస్తు, రవిపాడు రోడ్డు, హీరో షో రూమ్ ఎదురుగా, నరసారావుపేట్, గుంటూరు జిల్లా-522601. **2. శ్రీమతి ఆకుల శ్రీ దుర్గ దేవి** కేరాఫ్ సత్యనారాయణ, డోర్ నం.జి3, 1వ అంతస్తు, రవిపాడు రోడ్డు, హీరో షో రూమ్ ఎదురుగా, నరసారావుపేట్, గుంటూరు జిల్లా-522601. A/C No: -921030018978679 & 921030018978682 డిమాండ్ నోటీసు తేది: 30.03.2022, స్వాధీనతా ప్రకటన తేది: 10.03.2023.	Rs.42,11,747/- (రూపాయలు నలభై రెండు లక్షల పదకొండు వేల ఏడు వందల నలభై ఏడు మాత్రమే)	గుంటూరు జిల్లా, నర్సారావుపేట సబ్-డిస్ట్రిక్ట్, టౌన్, అరుండెల్‌పేట్‌లో డోర్ నం.10-5-77తో ఎస్‌ఆర్‌ఓ నరసారావుపేట్ పత్రం నం.9318/2021 తేది: 30.4.2021 ఆధారంగా శ్రీమతి సోనం రమాదేవి పేరున ఉన్న 109.82చ.గ.ల విస్తీర్ణపు సైటు & దానిపై ఆర్‌సిసి దాబా. **తూర్పు:** రామారావుకు చెందిన ఇల్లు మరియు 16'.4" ఉమ్మడి గోడ, **దక్షిణం:** జి. నాగేశ్వర రావు మొ॥వారికి చెందిన ఇల్లు-56.8", **పడమర:** మున్సిపల్ బజార్-18.6", **ఉత్తరం:** జి. వెంకట కోటేశ్వరమ్మకు చెందిన ఇల్లు & 56.10" ఉమ్మడి గోడ. ఈ పై సరిహద్దుల్లో 109.82చ.గ.లు లేదా 91.82చ.మీ.ల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్ 70.67చ.మీ.లు, మొదటి అంతస్తు 70.67చ.మీ.లు కలిగియున్న ఆర్‌సిసి నిర్మాణాలు, మొత్తం నిర్మాణం విస్తీర్ణం 141.34చ.మీ.లు.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత, సహ రుణగ్రహీత పేరు/లోను ఎకౌంట్ నంబర్	ఆస్థి వివరణ/స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులోని మొత్తము (రూ.)	శాఖ పేరు
1.	వెంకట రాఘవేంద్ర లంకోజి (రుణగ్రహీత), శాంతి లంకోజి (సహ రుణగ్రహీత) LHVJW00001384989.	ఎఫ్ఎఫ్2, ఆర్ఎస్ నం.172 2, 172 3, 1వ అంతస్తు సాయి టెన్యూర్: 491 టోవ్, విజయవాడ, ఎన్ఎ, విజయవాడ 520007. హద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఉమ్మడి గోడ బి డబ్ల్యూ ఎఫ్ఎఫ్-2 మరియు ఎఫ్ఎఫ్-1, తూర్పు: కామన్ కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై, స్వాధీనత తేది: 13-మార్చి-23	26-12-2022 Rs. 25,08,860/-	విజయవాడ-బి

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 16 మార్చి, 2023
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

బిఆర్‌ఎస్ నేతలపై చర్యలు తీసుకోండి

- జాతీయ మహిళ కమిషన్‌కు వైఎస్ షర్మిల ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళ నేతలను అగౌరవ పరిచిన అధికార బిఆర్‌ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జాతీయ మహిళ కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) చైర్ పర్సన్ రేఖ శర్మకు ఫిర్యాదు చేశారు. ఆమెను కలిసి మూడు పేజీల వినతి పత్రంతో పాటు బిఆర్‌ఎస్ నేతలు అసభ్యకరంగా దూషించిన వీడియోలను అందజేశారు. మహిళలపై బిఆర్‌ఎస్ నేతలకు గౌరవం లేదని, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పాదయాత్ర చేస్తున్న తనపై దాడులకు దిగుతున్నారని విమర్శించారు. బహిరంగగానే ఎలా బయట తిరుగుతావో చూస్తామంటూ బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో మహిళలకు రక్షణ లేదని తెలిపారు. కెసిఆర్ తనయుడు కెటిఆర్ ఆడవాళ్ళు వ్రతాలు చేసుకోవాలని సూచిస్తున్నారని, మహిళలంటే ఒక మంత్రికి మరదలుతో సమానమని ధ్వజమెత్తారు. ఒక మహిళా అని కూడా చూడకుండా ఒక ఎమ్మెల్యే కొజ్జా అని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు ఎత్తి చూపిస్తే, శిఖండి అని వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని తెలిపారు. వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై సానుకూలంగా జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖ శర్మ సానుకూలంగా స్పందించారు. అసభ్యకర పదజాలంతో దూషించిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వైఎస్‌ఆర్‌టిపి తెలిపింది.

జాతీయ పురుషుల కమిషన్ ఏర్పాటు కోసంపిటీషన్

న్యూఢిల్లీ : గృహహింసకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న వివాహిత పురుషుల సమస్యను పరిష్కరించేందుకు 'జాతీయ పురుషుల కమిషన్'ను ఏర్పాటు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలయింది. న్యాయవాది మహేష్ కుమార్ తివారీ ఈ పిటీషన్ దాఖలు చేశారు. 2021 నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక ప్రకారం గృహహింసల కారణంగా ఆత్మ హత్యలకు పాల్పడినవారిలో మహిళల కంటే పురుషులే అధికంగా ఉన్నారని పిటీషన్‌లో తెలిపారు. ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం 2021లో దేశవ్యాప్తంగా 1,64,033 మంది గృహ హింస కారణంగా ఆత్మహత్యలకు పాల్పడగా వీరిలో 28,680 మంది వివాహిత మహిళలు, 81,063 మంది వివాహిత పురుషులని తెలిపారు. అలాగే, వివాహిత పురుషుల ఆత్మహత్యల సమస్యను పరిష్కరించేందుకు, గృహ హింసకు గురవుతున్న పురుషుల ఫిర్యాదులను స్వీకరించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆదేశించాలని కూడా పిటీషన్‌దారులు కోరారు.

శత్రు వైఖరి విడనాడండి !

- అమెరికాను కోరిన రష్యా

మాస్కో : నల్ల సముద్రంపై అమెరికన్ డ్రోన్‌ని రష్యా యుద్ధ విమానం ఢీ కొన్న తర్వాత ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో అమెరికా శత్రు విమానాలను ఆపాలని బుధవారం రష్యా కోరింది. మానవ రహిత రీపర్ డ్రోన్ ప్రొపెల్లర్‌ను తమ ఎస్‌యు-27 విమానం కత్తిరించిందన్న ఆరోపణలను రష్యా ఇప్పటికే తిరస్కరించింది. అయితే ఉక్రెయిన్ ఘర్షణను మరింత విస్తృతం చేసేందుకు అంతర్జాతీయ జలాల్లో రష్యా చేసిన ప్రయత్నంగా దీన్ని కీవ్ అభివర్ణించింది. మంగళవారం డ్రోన్ కూలిన సంఘటనను అత్యంత నిర్లక్ష్యపూరితమైన వ్యవహార శైలిగా అమెరికా పేర్కొంది. దీంతో రష్యా, పశ్చిమ దేశాల పట్ల కొత్తగా ఉద్రిక్తతలు తలెత్తాయి. అమెరికా ఆయుధాలను వినియోగించే చర్యలేవైనా వాటిని శత్రు చర్యలుగానే పరిగణిస్తామని అనతోవ్ టెలిగ్రామ్ చానెల్‌లో పేర్కొన్నారు. డ్రోన్ రొటీన్ కార్యకలాపాల్లో భాగంగా వుందని పెంటగన్ పేర్కొంది. నిర్లక్ష్యంగా, పర్యావరణ పరంగా ఏమాత్రమూ మంచిది కాని రీతిలో డ్రోన్‌ను ఢీ కొట్టారని విమర్శించింది. కాగా రష్యా ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ, తమ విమానం నియంత్రణలో లేదని పేర్కొంది.

నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్ పేలుడు వెనుక అమెరికా హస్తం : పుతిన్

మాస్కో : నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్ పేలుడు ఘటనలో ఉక్రెయిన్ కార్యకర్తల ప్రమేయం వుందనే సిద్ధాంతం పూర్తిగా అర్ధం లేనిదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. ఈ తీవ్రవాద చర్య వెనుక అమెరికా హస్తం వుందని విమర్శించారు. యురోపియన్ మార్కెట్‌కు రష్యా ఇంధనం అందకుండా చేయాలని అమెరికా కచ్చితంగా భావిస్తుందని, దానికి బదులుగా ఎల్‌ఎన్‌జితో సహా తన ఇంధనాన్ని సరఫరా చేయాలని ఆశిస్తుందని, పుతిన్ పేర్కొన్నారు. రష్యా సరఫరా చేసే ఇంధనంతో పోలిస్తే అమెరికా ఇంధన వ్యయం 25 నుండి 30శాతం ఎక్కువగా వుంటుందన్నారు. రష్యన్ టివి కార్యక్రమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ మాట్లాడారు. తీవ్రవాద చర్య జరిగిన ఆ పైప్‌లైన్ ప్రాంతానికి తమను అనుమతించకపోతే స్వంత దర్యాప్తు నిర్వహించడం తమకు సవాలుగా పరిణమిస్తుందని పుతిన్ చెప్పారు.

మహిళా కోటా బిల్లును ఆమోదించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు



లిమెరిడియన్ హెూటల్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశ దృశ్యం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించాలని 13 పార్టీల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం నాడిక్కడ లిమెరిడియన్ హెూటల్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 13 రాజకీయ పార్టీలు, వివిధ ప్రజా, మహిళా సంఘాల నేతలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ దేశం, సమాజం సమగ్రాభివృద్ధి నిర్ణయం తీసుకోవడంలో మహిళలకు కీలక పాత్ర ఇవ్వాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజకీయ పార్టీలు, ప్రత్యేకించి ప్రతిపక్షాలు మద్దతిస్తున్నాయని, ప్రభుత్వం చొరవ చూపడం లేదన్న సందేశం ఈ వేదిక ద్వారా స్పష్టమవుతోందని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

రాజకీయాల్లో మహిళ భాగస్వామ్యంతోనే సాధికారిత సాధ్యం : జాన్ బ్రిట్టాస్, సిపిఎం

సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో మహిళ రిజర్వేషన్ బిల్లుకు చాలా పార్టీలు వైఖరి వ్యతిరేకంగా ఉందని తెలిపారు. రిజర్వేషన్ అంటే ఏదో పాలనలో బాధ్యలు ఇవ్వడం కాదని, దేశ ప్రజల్లో సగం మంది ఉన్న మహిళలకు భాగస్వామ్యం కల్పించడమని స్పష్టం చేశారు. పురుషులు కంటే మహిళలు ఎక్కువ మంది ఓటు వేస్తున్నారని, వారికి రాజకీయాల్లో సముచిత స్థానం లభించాలని అన్నారు. దశాబ్దాలుగా మహిళ రిజర్వేషన్ బిల్లు గురించి ఎదురు చూస్తున్నామని, ఇప్పటికే లోక్‌సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో మహిళ భాగస్వామ్యంతోనే నారీశక్తి, మహిళా సాధికారిత సాధ్యం అవుతాయని స్పష్టం చేశారు.. పార్లమెంట్‌లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పుడే ప్రజస్వామ్యానికి ఒక అర్థం ఉంటుందని అన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని, బిల్లును తెచ్చి ఆమోదించాలని డిమాండ్ చేస్తుందని తెలిపారు.అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇచ్చినప్పుడు బిల్లు ఎందుకు ఆమోదం పొందటం లేదని ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ అన్నారు.

మహిళలకు ఎందుకు రిజర్వేషన్ కల్పించదు? : ప్రియాంక చతుర్వేది, శివసేన

శివసేన ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ ఓటు వేయడంలో రాజ్యాంగ నిర్మాతలు మహిళలకు సమాన హక్కు కల్పించినప్పుడు, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి ప్రభుత్వం మహిళలకు ఎందుకు రిజర్వేషన్ కల్పించదని ప్రశ్నించారు. ఈ అంశంపై చట్టసభల్లో ఉన్న మహిళలు ప్రభుత్వాలను మరింతగా డిమాండ్ చేయాలని సూచించారు. ఆర్జేడి ఎంపి మనోజ్ ఝా మాట్లాడుతూ రిజర్వేషన్ బిల్లుకు తాము మద్దతిస్తున్నాని ప్రకటించారు. అయితే, రిజర్వేషన్‌లో రిజర్వేషన్ కోటా ఉండాలని ప్రతిపాదించారు.

వ్యూహాత్మక నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యంః సుమతి, డిఎంకె

డిఎంకె ఎంపి తమిళ్ సై తంగపంద్యాన్ (సుమతి) మాట్లాడుతూ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో మహిళల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చడానికి చేసే ఈ పోరాటంలో తాము కలిసి నడుస్తామని అన్నారు. సిపిఐ ఎంపి బినయ్ బిశ్వం మాట్లాడుతూ 21వ దశాబ్దంలో కూడా మహిళా హక్కులు ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. ఈ ఉద్యమంలో తాము భాగస్వాములు అవుతామని ప్రకటించారు. జెఎంఎం ఎంపి మౌహ మాఝి మాట్లాడుతూ ఒకవైపు ఆజాదీ కా అమృత్ మహెూత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువ ఉండడం మంచిగా అనిపించడం లేదని అన్నారు.

ప్రజలకు మంచి చేసే బిల్లులు తీసుకుని రావాలి : రాఘవ్ చద్దా

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి రాఘవ్ చద్దా మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ల కోసం కవిత లేవనెత్తిన డిమాండ్‌కు తాము సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ప్రకటించారు. ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని, దాన్ని సంస్కరణలు తీసుకురావడంతో పాటు ప్రజలకు మంచి చేసే బిల్లులను తీసుకురావడానికి ఉపయోగించాలని సూచించారు. సమాజ వాది పార్టీ ఎంపి ఎస్‌టి హాసన్ మాట్లాడుతూ మహిళలకు తగిన వాటా కల్పించకుండా, గౌరవం ఇవ్వకుండా ఏ దేశం కూడా సూపర్ పవర్ కాబోదని స్పష్టం చేశారు. విసికె ఎంపి తిరుమావలవన్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు తక్షణ అవసరమని తెలిపారు. ఆర్‌ఎల్‌డి పార్టీ మహిళా విభాగం నేత ప్రతిభా సింగ్, ఆ పార్టీ నేత భూపేంద్ర చౌదరి మాట్లాడుతూ రిజర్వేషన్లపై మహిళల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా బిల్లుపై జరుగుతున్న చర్చల గురించి గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాజ్యసభ ఎంపి సంతోష్ కుమార్, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రైతు నేతలు గుర్నామ్ సింగ్ ఛదౌని, రాజేవాలా, బిఆర్‌ఎస్ ఎంపి మాలోతు కవిత, జోగినపల్లి సంతోష్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర, వెంకటేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ అదే తీరు

- అధికార, ప్రతిపక్షాల ఆందోళనతో స్తంభించిన పార్లమెంట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా మూడో రోజూ కూడా అదే తీరు కొనసాగింది. అధికార బిజెపి, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించాయి. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపై ప్రతిపక్ష ఎంపిలు ఆందోళన చేయగా, రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని అధికార బిజెపి ఎంపిలు ఆందోళన చేపట్టడంతో దీంతో ఉభయసభలు దద్దరిల్లుతున్నాయి. అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ ఆందోళనలతో పార్లమెంట్ ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగింది. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు చేబూని ఆందోళనకు దిగారు. అదానీ అంశంపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నినాదాలు హెూరెత్తించారు. దానికి పోటీగా అధికార బిజెపి ఎంపిలు ఎదురుదాడికి దిగారు. నినాదాలతో గందరగోళం సృష్టించారు. లండన్‌లో దేశం పరువుతీసే వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ సభకు క్షమాపణలు చెప్పాలని పట్టుబట్టారు. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా కోరారు. అయినప్పటికీ అధికార పక్ష ఎంపిలు వెనక్కి తగ్గలేదు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు కూడా తమ ఆందోళనను కొనసాగించారు. వెంటనే సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో కూడా పరిస్థితిలో ఎటువంటి మార్పు రాకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే తీరు కొనసాగింది. రాజ్యసభ చైర్మన్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు, ఆ తరువాత గురువారం ఉదయం 11 గంటల వరకు వాయిదా పడింది. అంతకు ముందు అదానీ అంశంపై జెపిసి వేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ ఆవరణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి.

రాష్ట్రాలకు ఇవ్వని పంచాయతీ నిధులు

- కేంద్ర పంచాయతీరాజ్ శాఖను తప్పుపట్టిన పార్లమెంటరీ ప్యానెల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జిఎస్‌ఎ) కింద రాష్ట్రాలకు నిధులు విడుదల చేయకపోవడంపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తప్పుబట్టింది. బుధవారం రాజ్యసభలో సమర్పించిన నివేదికలో ఈ నిధులు ప్రధానంగా పంచాయతీల ఎన్నికైన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఇతర వాటాదారుల సామర్థ్యం పెంపుదల, శిక్షణ కోసం రాష్ట్రాలకు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి (2022 డిసెంబర్ 31 నాటికి) పథకం కింద 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధులు ఇవ్వలేదని పేర్కొంది. అదేవిధంగా, 2021-22లో 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధులు విడుదల కాలేదని తెలిపింది. "అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించకపోవడం, ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్దేశించిన సూచనలను పాటించకపోవడమే నిధులు విడుదల కాకపోవడానికి కారణమని మంత్రిత్వ శాఖ తెలిపినట్లు స్టాండింగ్ కమిటీ తన రిపోర్టులో పేర్కొంది. "అనేక రాష్ట్రాలకు ఈ విధంగా నిధులను నిలిపివేయడం పంచాయతీరాజ్ సంస్థల బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఈ ముఖ్యమైన ఆర్‌జిఎస్‌ఎ పథకం పురోగతిని అడ్డుకుంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఏకరీతిలో నిధులు విడుదలయ్యేలా ఆర్థిక మంత్రిత్వ శాఖ నిబంధనలు, అవసరమైన పత్రాల సమర్పణలో మంత్రిత్వ శాఖ క్రియాశీలకంగా ఉండాలి" అని కమిటీ సిఫార్సు చేసింది. అవసరమైతే, అటువంటి విషయాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అత్యున్నత స్థాయిలో చేపట్టాలని, తద్వారా ఆర్‌జిఎస్‌ఎ కింద నిధుల జాప్యం, విడుదల చేయని కారణంగా ఊహించిన పథకాల పురోగతికి ఆటంకం కలగదని కూడా పేర్కొంది. గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లు అందుబాటులో లేకపోవడంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. "దేశంలోని 2,71,102 గ్రామ పంచాయతీలలో 2,19,889 గ్రామ పంచాయతీల్లో మాత్రమే కంప్యూటర్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇంటర్నెట్ సేవా సౌకర్యాలను ఉపయోగించుకోవడానికి కంప్యూటర్ల లభ్యత తప్పనిసరి" అని పేర్కొంది. 1.92 లక్షల గ్రామపంచాయతీలు సేవలను సిద్ధంగా ఉంచినప్పటికీ, 2,71,102 గ్రామీణ స్థానిక సంస్థల్లో 2023 జనవరి 21 నాటికి 80,742 గ్రామీణ స్థానిక సంస్థలకు మాత్రమే క్రియాశీల ఇంటర్నెట్ కనెక్షన్ ఉందని తెలిపింది. "గ్రామ పంచాయతీల్లో ఇంటర్నెట్ కనెక్షన్ సౌకర్యాన్ని కలిగి ఉండేలా చేయడానికి, అన్ని గ్రామ పంచాయతీలను బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీతో కనెక్ట్ చేయడానికి ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలని మంత్రిత్వ శాఖను కమిటీ కోరింది. 2024-25 నాటికి ఈ విషయంలో సాధించిన పురోగతిని కమిటీకి తెలియజేయాలని కోరుతోంది" అని పేర్కొంది. జనన, మరణ ధృవీకరణ పత్రాలను మాత్రమే పరిమితం చేయకుండా అన్ని గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా ఆన్‌లైన్ హామీ సేవలను అందించాలని సూచించింది.

సోషలిస్టు పంథాను ఎన్నడూ వీడబోం

- ప్రజలే మొదటి ప్రాధన్యతతో చైనా ఆధునీకీకరణ విధానం
- ప్రపంచ రాజకీయ పార్టీల సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- సదస్సులో పాల్గొన్న 530 పార్టీలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చైనా ఎన్నటికీ సోషలిస్టు విధానాన్ని విడనాడబోదని చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆ దేశ అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ స్పష్టం చేశారు. చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) ఆధ్వర్యంలో "ప్రపంచ రాజకీయ పార్టీలు-ఆధునికీకరణ మార్గాలు " అన్న అంశంపై బుధవారం నాడిక్కడ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 530 పార్టీలు పాల్గొన్నాయి. ఈ సదస్సును చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ వీడియో లింక్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కీలకోపన్యాసం చేస్తూ 'ప్రజలకి మొదటి ప్రాధన్యత' ఇచ్చే ఆధునీకరణ విధానాన్ని మాత్రమే చైనా అనుసరిస్తుందని అన్నారు. సోషలిస్టు విధానాన్ని చైనా ఎన్నటికీ వీడబోదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపేందుకు కుట్రలు చేయడం ప్రజాస్వామ్యమే కాదని చైనా అధ్యక్షుడు అన్నారు. వలసవాదాన్ని, అభివద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఆధిపత్య విధానాన్ని చైనా ఎప్పటికీ అనుసరించబోదని పేర్కొన్నారు. చైనా తన చేతనైనంత వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను చూపుతోందని, అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని దేశాల (ఉత్తర, దక్షిణ దేశాలు) మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. . ఈ దిశగా చైనా ప్రపంచ నాగరికతల మధ్య సమన్వయానికి సరికొత్త చొరవ తీసుకుంటుందని జిన్‌పింగ్ ప్రకటించారు. ఏ దేశానికి ఆదేశంలో ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని, ఆ ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆధునికీకరణ విధానాన్ని అవలంబించాలని సూచించారు. అంతేతప్ప ప్రపంచమంతా ఒకే విధంగా ఆధునీకరించ బడాలనే విధానాలను రుద్దే ప్రయత్నాలు సరైనవి కావన్నారు. ఆధునీకరణ అంటే ఒక దేశం మరొక దేశాన్ని దోచుకోవడం కాదని, అన్ని దేశాలు కలిసి అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, నికరాగ్వా అధ్యక్షుడు డేనియల్ ఒర్టేగా, బొలివియా మాజీ అధ్యక్షుడు ఇవో మొరేల్స్, సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్ తదితరులు మాట్లాడారు. అనేక దేశాధినేతలు, వివిధ దేశాలకు చెందిన అధికార, ప్రతిపక్షనేతలు పాల్గొన్నారు. దక్షిణాఫ్రియా, పోర్చుగీస్, వియత్నాం, బ్రెజిల్, ఉత్తరకొరియా తదితర దేశాల కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. మన దేశం నుంచి సిపిఎం తరపున ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, కేంద్ర కమిటీ సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాక్రాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద పెన్షన్ బిల్లును అడ్డుకునేందుకు చివరి యత్నంగా ఫ్రాన్స్ అంతటా హెూరెత్తిన నిరసనలు. రిటైర్మెంట్ వయోపరిమితిని 64 ఏళ్లకు పెంచడానికి నో చెబుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం.

అకస్ అణు ఒప్పందంపై సిడ్నీలో నిరసనలు

సిడ్నీ : అణు జలాంతర్గాముల కోసం అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని నిరసిస్తూ సిడ్నీలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. 8 జలాంతర్గాములకు కేటాయించిన బడ్జెట్‌తో 3,20,000 ఇళ్ళను నిర్మించవచ్చని, 4500 పాఠశాలలను ఏర్పాటు చేయవచ్చని, 2,70,000 ఉద్యోగాలను సృష్టించవచ్చని పేర్కొంటూ ఆస్ట్రేలి యా శాంతి కార్యకర్తలు నిరసన నిర్వహించారు. ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్‌ల మధ్య కుదిరిన అణు జలాంతర్గాముల ఒప్పందాన్ని నిరసిస్తూ సిడ్నీ టౌన్ హాల్ వెలుపల నిరసన ప్రదర్శన నిర్వహించారు. "అణు జలాంతర్గాములు వద్దు, అకస్ మమ్మల్ని దోచుకుంటోంది, పసిఫిక్ కోసం శాంతి" అంటూ అకస్ వ్యతిరేక సంకీర్ణ కూటమి నినాదాలు చేస్తూ, బ్యానర్లు ప్రదర్శించింది. ఈ ఒప్పందం వల్ల రాబోయే 40ఏళ్ళలో ఆస్ట్రేలియా తీవ్ర ఖర్చును ఎదుర్కొనాల్సి వస్తుందని ఆస్ట్రేలియా నేత డెన్నిస్ డోహర్టీ విమర్శించారు. అందువల్ల దీన్ని తాము స్వాగతించదలచుకోలేదన్నారు. ప్రజా విధ్వంసాన్ని కలిగించే భయంకరమైన ఆయుధాలపై ఇలా డబ్బును వృధా చేయడం తనకు నచ్చలేదన్నారు. 2050 నాటికి ఈ ఒప్పందం వ్యయం 24500కోట్ల డాలర్లు అవుతుందని అంచనా వేశారు.

కేంద్ర సాయుధ పోలీస్ బలగాల్లో 84,866 పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్ వంటి ఆరు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లో మొత్తం 84,866 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో సిపిఎం ఎంపి వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2013 జనవరి 1 నాటికి సిఆర్‌పిఎఫ్‌లో 29,283, బిఎస్‌ఎఫ్‌లో 19,987, సిఐఎస్‌ఎఫ్‌లో 19,475, ఎస్-ఎస్‌బిలో 8,273, ఐటిబిపిలో 4,142, అస్సాం రైఫిల్స్‌లో 3,706 ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

2,354 నర్సులు, 247 వైద్యుల పోస్టులు ఖాళీ

2023 జనవరి 1 నాటికి సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లో మొత్తం 247 వైద్యుల పోస్టులు, 2,354 నర్సులు, ఇతర వైద్య నిపుణుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని నిత్యానంద్ రాయ్ చెప్పారు.

కేంద్ర విద్యా సంస్థల్లో 11,086 బోధనా పోస్టులు ఖాళీ

దేశవ్యాప్తంగా కేంద్ర విద్యా సంస్థల్లో 11,086 బోధన పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. అందులో సెంట్రల్ యూనివర్శిటీల్లో 6,028 బోధన పోస్టులు, ఐఐటిల్లో 4,562, ఐఐఎంల్లో 436 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రాజ్యసభలో ఎంపి సిఎం రమేష్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సెంట్రల్ యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న 6,028 పోస్టుల్లో జనరల్ 2,154, ఎస్సీ 878, ఎస్టీ 520, ఒబిసి 1,543, ఈడబ్ల్యుఎస్ 611, పిడబ్ల్యుడి కేటగిరి పోస్టులు 322 అని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 61,361 మంది విద్యార్థులు డ్రాపౌట్స్

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగేళ్లలో 61,361 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ అయినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణ దేవి తెలిపారు. వైసిపి ఎంపి ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018-19లో 10,83,747 ఉన్న విద్యార్థుల సంఖ్య 2021-22 నాటికి 1022,386కి తగ్గిపోయిందని తెలిపారు. 2019-20లో 10,32,570గా ఉన్న విద్యార్థుల సంఖ్య 2020-21లో 10,32,049కి తగ్గిందని మంత్రి వెల్లడించారు.

ఉపాధి హామీ పనుల్లో బయోమెట్రిక్ హాజరు నిబంధన లేదు

ఉపాధి హామీ పనుల్లో బయోమెట్రిక్ హాజరు అనే నిబంధన లేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి తెలిపారు. టిడిపి ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉపాధిహామీ పథకం కింద ఈ ఏడాది మార్చి ఒకటి నాటికి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.819.12 కోట్లు, వేతనాల కింద రూ.205.24 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని వైసిపి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

కేంద్ర సాయుధ బలగాల్లో 436 మంది ఆత్మహత్య

కేంద్ర సాయుధ బలగాల్లో మూడేళ్లలో 436 మంది ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2020లో 144, 2021లో 157, 2022లో 135 మంది సాయుధ బలగాల్లో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

ఎపిలో 62,696 రేషన్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి

ఆంధ్రప్రదేశ్‌లో 62,696 రేషన్ కార్డులకు సంబంధించిన అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర వినియోగదారు వ్యవహారాల సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ రాయ్ తెలిపారు. లోక్‌సభలో టిడిపి ఎంపి గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏపిలో ప్రస్తుతం 99,65,574 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు.

ఇడి నోటీసులను రద్దు చేయండి

సుప్రీం కోర్టులో కవిత పిటిషన్ • ఈనెల 24న విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో విచారణకు హాజరుకావాలని ఇడి ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత సుప్రీంకోర్టును కోరారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. అయితే ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈనెల 24న విచారణ చేపడతామని పేర్కొంది. బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం ముందు కవిత తరపున న్యాయవాది వందన సెహెగల్ ప్రస్తావించారు. ఎఫ్‌ఐఆర్‌లో కవిత పేరు లేకపోయినప్పటికీ, కేంద్రంలో అధికారంలో ఉన్న అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని అడ్డుగా పెట్టుకుని ఆమెపై రాజకీయ కారణాలతో ఆరోపణలు చేస్తోన్నారని అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ కేసులో కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబు ఈడి ఎదుట హాజరయ్యారు. లిక్కర్ వ్యాపారి అరుణ్ పిళ్ళై, గోరంట్ల బుచ్చిబాబును కలిపి ఈడి ప్రశ్నించినట్లు తెలిసింది. మద్యం విధానం రూపకల్పన, హెూటల్స్‌లో జరిగిన సమావేశాలు, డ్రాఫ్ట్ పాలసీ ముందుగా నిందితులకు రావడం, రూ.100 కోట్ల ముడుపుల వ్యవహారాలు, ఆధారాల ధ్వంసం సహా అనేక అంశాలపై నిందితుల నుంచి ఈడి సమాధానాలు కోరినట్లు తెలిసింది. ఇప్పటికే ఫిబ్రవరి 28న తీహార్ జైలులో బుచ్చిబాబు నుంచి కీలక సమాచారాన్ని ఈడి రాబట్టింది.

నేడు ఇడి ముందుకు కవిత

ఢిల్లీ మద్యం కుంభకోణంలో గురువారం ఇడి ముందు ఎమ్మెల్సీ కె.కవిత హాజరుకానున్నారు. ఈనెల 11న కవితను దాదాపు తొమ్మిది గంటల పాటు విచారించిన ఈడి, ఆమె ఫోన్‌ను స్వాధీనం చేసుకుని స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

కోటంరెడ్డి నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ఆటంకం కలిగిస్తున్న కోటంరెడ్డిని సస్పెండ్ చేయాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టడంతో స్పీకరు ఆ సెషన్ ముగిసేవరకు కోటంరెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తన సస్పెన్షన్ అన్యాయమని, మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని స్పీకరు పోడియం ముందు నినాదాలతో నిరసన వ్యక్తం చేయడంతో మార్షల్స్ వచ్చి కోటంరెడ్డిని బయటకు ఎత్తుకెళ్లిపోయారు. కోటంరెడ్డి కావాలనే రగడ చేయాలనుకుంటున్నారని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకముందు కోటంరెడ్డి పట్ల మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అసభ్య పదజాలంతో ధూషించారు. కోటంరెడ్డి నమ్మకద్రోహి అని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు.

పార్లమెంటు నుంచి ఇడికి మార్చ్

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఇడి తన అధికార పరిధిని విస్తరించి రాజకీయ ఆశ్రితపక్షపాతానికి సంబంధించిన కేసుల్లో ఎలా విచారణ సాగించిందో మాకు బాగా తెలుసు, ఈ అంశంపై నియమించిన సుప్రీం కోర్టు కమిషన్ పరిమిత చెల్లింపుల గురించి కూడా తెలుసు. ఈ కారణాల రీత్యా లేదా ఇతర కారణాలతో ఇడి తన అధికార పరిధిని త్యజించలేదని ఈ సందర్భంగా ఇడికి గుర్తు చేయదలచాం." అని నేతలు లేఖలో పేర్కొన్నారు. ఈ కారణాల రీత్యా, పైన పేర్కొన్న ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని లేఖలో పేర్కొన్నారు. ఇటువంటి ఇతర కేసులను అత్యుత్సాహంగా విచారిస్తూ వచ్చిన ఇడి ఇంతటి తీవ్రమైన ఆరోపణలపై కనీసం ప్రాథమిక విచారణనైనా చేపట్టాలని కోరారు. కేవలం మన ఆర్థిక వ్యవస్థకే కాకుండా మన ప్రజాస్వామ్యానికి కూడా తీవ్రమైన పర్యవసానాలు కలిగించగల ఈ అంశాలపై ఇడి దర్యాప్తు చేయాలని వారు కోరారు. ఈ లేఖలో విషయాలను ట్విట్టర్‌లో కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పంచుకున్నారు. 16 ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు, ఎంపిలు ఇడికి లేఖ అందచేసేందుకు వెళుతుండగా, పోలీసులు అడ్డుకున్నారని, దాంతో తాము లేఖను ఇ మెయిల్ చేశామని చెప్పారు.

ఈ కేసులో తీవ్రమైన, సుదూర కాలంలో తీవ్ర పర్యవసానాలు కలిగించగల అవినీతి ఆరోపణలు ఇమిడి వున్నాయని వారు పేర్కొన్నారు. కార్పొరేట్ అవినీతి, రాజకీయ అవినీతి, అక్రమ పద్ధతుల ద్వారా స్టాక్‌ధరల్లో అవకతవకలు వంటి అనేక అంశాలు దీంతో ముడిపడ్డాయన్నారు. ఒక్క కార్పొరేట్ గ్రూపునకు లబ్ధి చేకూర్చేందుకు ప్రజా వనులన్నింటినీ దుర్వినియోగం చేశారని విమర్శించారు. కృత్రిమంగా స్టాక్ విలువలు పెరిగేలా, గ్రూపు కంపెనీల ఆర్థిక పరిస్థితులకు సంబంధించి వక్రీకరించబడిన అవగాహన కల్పించేందుకు గానూ అదానీ గ్రూపుకు చెందిన పక్షాల నియంత్రణలో గల బూటకపు కంపెనీలు, విదేశీ నిధుల నెట్‌వర్క్‌ను అదానీ గ్రూపు కంపెనీలు నెలకొల్పాయని ఆ లేఖలో నేతలు విమర్శించారు. 2021 సెప్టెంబరులో ముంద్రా విమానాశ్రయంలో దొరకిన మాదకద్రవ్యాలపై కూడా ఇంతవరకు సీరియస్‌గా దర్యాప్తు సాగలేదని ఆ లేఖ పేర్కొంది. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి అదానీ గ్రూపు తీసుకున్న రుణాల గురించి మాట్లాడుతూ, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, యథా ప్రకారం చట్ట ఉల్లంఘనజరిగినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇన్ని అంశాలు వున్నా ఈ గ్రూపు వ్యవహారాలపై ప్రాథమిక దర్యాప్తు అయినా జరపాలన్న ఆలోచన, ఆసక్తి ఇడికి లేకపోవడాన్ని వారు ప్రశ్నించారు.



మీకోసం

ఒక కప్పు పాలలో అర టీ స్పూన్ పసుపు వేసి మరిగించి, కాస్త చల్లార్చి అందులో చిటికెడు నల్ల మిరియాలు, కొన్ని చుక్కల తేనె కలిపి తీసుకుంటే అలర్జీ సమస్యను నివారించవచ్చు.

జీవన సౌరభం

మాటలు చెప్పే వారి కంటే వినే వారికే ఎక్కువ విజ్ఞానం లభిస్తుంది.

చదువు



జీవన గమనంలో గమ్యం చూపుతూ
ఆశయ తీరాల ఒడ్డున చేర్చే చుక్కాని
బతుకు తెరువు చూపు భాగ్యరేఖ 'చదువు'

చీకటి బతుకులలో చిరుదివ్వెలు వెలిగిస్తూ
జీవం పోసి పునర్జన్మనిచ్చే దివ్య ఔషధం
నిత్య చైతన్యం చెందే కాంతిరేఖ 'చదువు'


కర్మాగారాల్లో కాలుతున్న బాల్యాన్ని గుర్తించి
తన ఒడి లో చేర్చుకుని భవిష్యత్‌ను నిర్దేశించేది
బాలల బంగారు జీవితానికి జీవన రేఖ 'చదువు'

అనాధ వీధి బాలలకు బాసగా నిలుస్తూ
పాఠశాలలో కుటుంబాన్ని పరిచయం చేసి
ఆత్మీయతను పంచే ప్రేమ రేఖ 'చదువు'

ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగని నినదిస్తూ
బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేది
మహిళ బతుకు బాటలో వెలుగు రేఖ 'చదువు'

- కయ్యూరు బాల సుబ్రమణ్యం
77802 77240

ఖాళీలు పూరించండి



పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ





తోటసాయి యశస్విని, 7వ తరగతి, నంద్యాల జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పల్లెల్లో న్యూరాలజీ వైద్యం

రాష్ట్రంలో చాలామంది నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నట్లు ఆరోగ్య సంస్థలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ పల్లె ప్రజలే ఎక్కువ. ఈ క్రమంలో పదేళ్ల నుంచి డాక్టర్ బిందు మీనన్ గ్రామాల్లో ఉచిత ఆరోగ్య సంరక్షణ సేవలను చేపట్టారు. 'న్యూరాలజీ ఆన్ వీల్స్' ఫౌండేషన్ ద్వారా ఆసుపత్రికి కూడా రాలేని మారుమూల గ్రామాలకు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. రక్త పరీక్షలు చేసి, మందులు అందజేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ 'మృధా స్పిరిట్ ఆఫ్ న్యూరాలజీ హ్యుమానిటేరియన్' అవార్డు అందించి అభినందించింది.





శరీరంలో కీలకమైన భాగాల్లో నాడీ వ్యవస్థ ఒకటి. దానికి అనుసంధానమైన నరాలు అధిక రక్తపోటు, మధుమేహం (చక్కెర) వ్యాధులతో దెబ్బతిన్నప్పుడు బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు, మూర్ఛ ... రకరకాల జబ్బులు వస్తాయి. ఈ నేపథ్యంలో వెంటనే ఆ రోగికి వైద్యం అందాలి. లేకుంటే జీవితాంతం మంచానికి పరిమితి అవడం లేదా చనిపోవడం జరుగుతుంది. పల్లెటూళ్లలో, మారుమూల ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నిరక్షరాస్యులు ఈ వ్యాధి పట్ల పెద్దగా అవగాహన లేక రెండు, మూడు రోజుల తర్వాత వైద్యులను సంప్రదించడం జరుగుతోంది. దాంతో వైద్యం ఆలస్యమై నాడీ వ్యవస్థ దెబ్బ తినే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో న్యూరాలజీ డాక్టర్ బిందు మీనన్ గ్రామాల్లో ఈ సమస్య పట్ల అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధి లక్షణాలను ముందే గమనించి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

పేదల కోసం

భోపాల్‌లో పుట్టి పెరిగిన ఆమె తండ్రి ఇంజనీర్. తల్లి గృహిణి. చిన్నతనం నుంచీ ఆపదలో ఉన్నవారికి సహాయం చేస్తూ ఉండేవారు. ఉద్యోగం రీత్యా వారి కుటుంబం కేరళలో స్థిరపడింది. బిందు మీనన్ వైద్య విద్య అక్కడే పూర్తి చేశారు. పదిహేనేళ్ల క్రితం తిరుపతిలో ఒక వైద్య కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అత్యవసర సమయంలో దగ్గర్లో ఉన్న వైద్యశాలల్లోనూ పనిచేశారు. చాలా మంది గ్రామీణ ప్రాంతాల వారు సుదూర ప్రయాణం చేసి ఆసుపత్రికి వచ్చేసరికి రోగికి వైద్యం ఆలస్యమయ్యేది. అప్పటికే కొంత నష్టం జరిగేది. వారు తిరిగి ఊరికి వెళ్లేందుకు రవాణా సదుపాయం లేక చాలా ఇబ్బందులు పడేవారు. వైద్య పరీక్షలకు, మందులకు తగినంత డబ్బు లేక .. అరకొర మందులు తీసుకుని ఇంటికి వెళ్లేవారు.

ఒకసారి ఒక రోగి బంధువు డాక్టర్ బిందు మీనన్‌ను 'అసలు ఈ వ్యాధి లక్షణాలను ముందుగా ఎలా గుర్తించాలి? భవిష్యత్తులో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అని అడిగింది. అప్పుడు బిందు సమాధానం చెప్పినా... తర్వాత ఆలోచనలో పడ్డారు. నాడీ సంబంధిత రుగ్మతల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, ఉచిత వైద్యం అందించటం అవసరమని అనుకున్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సొంత ఖర్చుతో 'న్యూరాలజీ ఆన్ వీల్స్' ఫౌండేషన్ స్థాపించారు. ఓ బస్సులో రోగి పడుకునేందుకు ఒక మంచం, డాక్టర్ కోసం కుర్చీ, నాడీ సంబంధిత పరీక్ష పరికరాలు, సిటి స్కానర్, రక్త పరీక్ష మిషన్లు ఏర్పాటు చేయించారు. తనతో పాటు కొంతమంది వైద్య విద్యార్థులు, ఆశా కార్యకర్తల భాగస్వామ్యంతో గ్రామాలకు వెళ్లటం ప్రారంభించారు.



పల్లెల్లో వైద్యం

డాక్టర్ బిందు మీనన్ ప్రస్తుతం నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో న్యూరాలజీ విభాగం అధిపతిగా, ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. చిత్తూరు, నెల్లూరు, తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు మెడికల్ వ్యాన్‌లో ప్రతినెలా వెళుతున్నారు. మూర్ఛ, పక్షవాతం, ఇతర దీర్ఘకాలిక నాడీ వ్యవస్థ సమస్యతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తున్నారు. వారితో ప్రేమగా మాట్లాడుతూ కౌన్సిలింగ్



చేస్తున్నారు. ఇప్పటి వరకూ 200కి పైగా ఉచిత వైద్య శిబిరాలను, కౌన్సిలింగ్ సెంటర్లను నిర్వహించారు. సుమారు 12 వేల మందికి ప్రతినెలా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈమె వైద్యం అందిస్తున్న దగ్గర నుంచి చాలామంది గ్రామీణ ప్రాంత రోగుల్లో మెరుగైన మార్పు కనిపించింది. కొంతమంది పనులకు వెళుతున్నారు. మంచానికే పరిమితి అయిన వృద్ధులు లేచి నడిచే ప్రయత్నం చేస్తున్నారు. రోగులు ప్రతిరోజూ మందులు వాడుతున్నారా? లేదా? అని బృందం ద్వారా ఎప్పటికప్పుడు బిందు కనుక్కుంటున్నారు.

అపోహలు తొలగించి ...

డాక్టర్ బిందు ప్రజల్లో నాడీ సంబంధ జబ్బుల పట్ల ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. మూర్ఛ రోగులను పెళ్లి చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం, ఇంట్లో వారు పెళ్లి ప్రయత్నాలు చేయకపోవడం, పక్షవాతం వచ్చిన వారు మంచానికే పరిమితం అవ్వడం చూసి ఆశ్చర్యపోయారు. దాంతో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలనుకున్నారు. 44 గ్రామీణ ప్రాంతాల్లోని అణగారిన ప్రజలకు అక్కడ వాలంటీర్ల బందంతో కలిసి సాధారణ నాడీ సంబంధిత పరిస్థితుల గురించి వివరించారు. స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటల్లో వైద్యం తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో, సామాజిక సంస్థల్లో దాదాపు 210 అవగాహనా ప్రచారాల కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళలకు శిక్షణ

న్యూరాలజీ ఆన్ వీల్స్‌తో పాటు, 2016లో ఆమె ఎపిలెప్సీ హెల్ప్ అనే యాప్‌ను ప్రారంభించారు. ఇది ఆకస్మిక మూర్ఛలు వచ్చినప్పుడు, అపస్మారక స్థితిలోకి వెళ్లినప్పుడు రోగుల కుటుంబాల నుంచి వైద్యబృందానికి హెచ్చరిక పంపిస్తారు. కరోనా సమయంలోనూ వైద్యులను చేరుకోలేని రోగుల కోసం స్ట్రోక్ హెల్ప్ యాప్ ద్వారా ఫౌండేషన్ సభ్యులు రోగులకు సకాలంలో చికిత్స అందించారు. కుటుంబంలో కీలక బాధ్యతలు నిర్వహించే మహిళలకు, యువతకు న్యూరోలాజికల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించే ప్రాజెక్టును ఈ మధ్యకాలంలో చేపట్టారు. ధూమపానం, ఆల్కహాల్ అలవాటు ఉన్న వారిలో వ్యాధి లక్షణాలను, స్ట్రోక్ వచ్చినప్పుడు వెంటనే చేయాల్సిన విధులపై దృష్టి సారిస్తున్నారు. డాక్టర్ బిందు నిస్వార్థ సేవలను అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ గుర్తించింది. 2022 ఎబి బేకర్ టీచర్ రికగ్నిషన్ అవార్డును అందించింది. 2021లో, వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ఆమెకు వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ఫెలోషిప్‌తో సత్కరించింది.

అంతటా అస్పష్టతే

- పవన్ ప్రసంగంలో ఊసేలేని బిసి డిక్లరేషన్
- ప్రస్తావనకు రాని కాపు రిజర్వేషన్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ పదో వార్షికోత్సవంలో సుదీర్ఘంగా సాగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగంలో రాష్ట్రంలో నెలకొన్న పలు కీలకాంశాలపై స్పష్టత లోపించింది. ప్రధాన సామాజిక తరగతులకు సంబంధించిన సమస్యలపై పార్టీ వైఖరి, కార్యాచరణ ప్రణాళిక ప్రకటించకుండానే ప్రసంగాన్ని ముగించారు. ఈ సమావేశాల్లో ఏదో మంచి నిర్ణయం ఉంటుందనే ఉద్దేశంతో అర్ధరాత్రి వరకూ ఎదురు చూసిన కాపు, బిసి సామాజిక తరగతులకు ఏమీ ప్రకటించకుండానే ఆపేశారు. రాజకీయ లక్ష్యాల్లోనూ ఎక్కడా స్పష్టత ఇవ్వకపోవడంతో క్యాడర్ కొంత గందరగోళంలో పడింది. ఓటు చీలనివ్వను అనేమాట తప్ప అదెలాగో స్పష్టంగా చెప్పలేదు. ఇప్పటికే బిజెపితో పొత్తులో ఉన్నామని చెబుతూనే టిడిపితోనూ పంచాయతీ నడుపుతున్నారనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో దానిపైనా వివరణ ఇవ్వలేదు. కులంతో తనకు సంబంధం లేదంటూనే తన తల్లిదండ్రుల కుల ప్రస్తావన తీసుకొచ్చారు. పేరుపెట్టి కాపు కుల ప్రస్తావన చేశారు. అదే సామాజికవర్గానికి చెందిన వారు తమకు రిజర్వేషన్ల అంశంపై ఏదైనా ప్రకటన చేస్తారనేమోనని రాత్రి వరకూ ఎదురు చూసి చివరకు నిరాశకు గురయ్యారు. మచిలీపట్నం వార్షికోత్సవ సభలో బిసి డిక్లరేషన్ ప్రకటిస్తామని గతంలో చెప్పారు. దానిపైనా పవన్ స్పష్టత ఇవ్వలేదు. రాష్ట్ర బిజెపి సరిగా స్పందించలేదని ఒకవైపు చెబుతూ కేంద్ర బిజెపితో సత్సంబంధాలు ఉన్నాయని, మోడీ అంటే గౌరవమని ప్రకటించారు. మైనార్టీలపై దాడులు జరిగితే ఊరుకోనని చెప్పిన పవన్ దేశ వ్యాప్తంగా బిజెపి నాయకుల చేస్తున్న మైనార్టీలపై దాడులు హత్యాకాండను ఖండించలేదు. ముఖ్యంగా రాజకీయ అంశాలపై క్లారిటీ లేని ప్రసంగం చేయడంపై జనసేన శ్రేణుల్లోనే నిరాశ కనిపిస్తోంది. జనసేన చట్టసభలో అడుగుపెట్టడం కీలకం. లేనిపక్షంలో క్యాడర్‌ను కాపాడుకోవడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలు, రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల కంటే ఎక్కువగా సీట్లు, ఓట్లు అనే అంశంపైనే ప్రసంగం మొత్తాన్ని సాగించారు. బిజెపి రాష్ట్రాలపై పెడుతున్న షరతులు, విధిస్తున్న భారాలపై కనీస స్పందన లేదు. గ్యాస్ ధరలు ఇటీవల కాలంలో భారీగా పెంచారు. దాన్నీ ఖండించలేదు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుల జీవనం కష్టమవుతోంది. దానికి కారణమైన బిజెపిని పల్లెత్తు మాట అనలేదు. కేంద్ర సంస్కరణల భారాలు మోపుతున్నా వ్యతిరేకించలేకపోయారు.

పట్టణ ప్రాంతాల్లో భారాలు మోపుతున్నా, చిరు వ్యాపారులపై దాడులు జరుగుతున్నా అవేవీ పవన్‌కల్యాణ్ దృష్టిలో లేకపోవడం బాధాకరం. పేదల భూములను పవర్ ప్రాజెక్టుల పేరుతో పెద్దలకు కట్టబెడుతున్నారు. అతిపెద్ద అదానీ కుంభకోణం అనంతరం రాష్ట్రంలో భూములు కేటాయించినా ఊసెత్తలేని స్థితిలో పవన్‌కల్యాణ్ సుదీర్ఘ ప్రసంగం సాగింది. వీటన్నిటినీ వదిలేసి కేవలం ఒకటీ రెండు అంశాలు, వ్యక్తిగత ప్రస్తావనలు చేయడంపై అయన అభిమానుల్లోనే నిరుత్సాహం వ్యక్తమవుతోంది. బిజెపితో కలిసి మైనార్టీలు, దళితులను ఉద్ధరిస్తానని చెప్పడాన్ని ఎవరూ విశ్వసించరని, ఇప్పటికైనా పవన్‌కల్యాణ్ తన స్పష్టమైన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

ఇంటర్ తొలి పరీక్షకు 96.24 శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. బుధవారం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షకు 96.24 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,04,835 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 4,85,842 మంది హాజరయ్యారు. 1,489 పరీక్ష కేంద్రాలను బోర్డు ఏర్పాటు చేసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 9 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది. బుధవారం ఉదయం పరీక్షలకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరిబాబు సెట్-1 ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశారు.

గవర్నరుతో ఎపిపిఎస్‌సి ఛైర్మన్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్‌తో ఎపిపిఎస్‌సి ఛైర్మన్ దామోదర్ గౌతమ్ సవాంగ్ బుధవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఆయనతోపాటు ఎపి స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యు లేటరీ మానిటరింగ్ కమిషన్, విశ్రాంత జస్టిస్ ఎ రామలింగేశ్వరరావు కూడా గవర్నరును కలిశారు. వీరి భేటీ కేవలం మర్యాద పూర్వకం మాత్రమేనని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

తిరుపతి ఎన్నికల్లో అక్రమాలు

కేంద్ర ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతిలో 2019 తరువాత జరిగిన పలు ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఎన్నికల కమిషనరుకు బుధవారం ఆయన లేఖ రాశారు. అధికార వైసిపి ఎన్నికల కోడ్‌ను తీవ్రంగా ఉల్లంఘించిందని పేర్కొన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021 మార్చి 10న జరిగిన ఎన్నికల్లో అధికార వైసిపి అధికారులతో కలిసి అవకతవకలకు పాల్పడిందని, దీనిపై గతంలోనే ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకగ్రీవాలు అయ్యాయని పేర్కొన్నారు. ఈ స్థాయి ఏకగ్రీవాలకు కారణం అధికార పార్టీ దౌర్జన్యాలు, బెదిరింపులు, అధికార దుర్వినియోగం అని గత రాష్ట్ర ఎన్నికల కమిషనరు కేంద్రానికి లేఖ రాశారని పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా తిరుపతి పట్టణంలో అధికార వైసిపి, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసులతో కుమ్మక్కై అనేక అక్రమాలకు పాల్పడిందని తెలిపారు. తిరుపతి పట్టణాన్ని కేస్ స్టడీగా తీసుకుని అధికార పార్టీ అక్రమాలను పరిశీలించాలని కోరారు. ఎన్నికల అధికారులు సరైన ధ్రువీకరణ లేకుండానే బోగస్, నకిలీ ఓటర్లను నమోదు చేశారని తెలిపారు. పోటీ చేసిన అభ్యర్థులకు భద్రత కల్పించలేదని, వైసిపి గూండాలు తమ పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌ను బెదిరించారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం సైతం ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి, కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో 2024లో తిరుపతి పట్టణంలో జరిగే సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బెంగళూరుకు ఊరట

యుపి వారియర్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలుపు



ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) జట్టుకు ఊరట లభించింది. వరుసగా ఐదు మ్యాచుల్లో ఓడిన బెంగళూరు జట్టు బుధవారం యుపి వారియర్స్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుపి వారియర్స్ జట్టు 19.3ఓవర్లలో 135పరుగులకు కుప్పకూలింది. ఛేదనలో బెంగళూరు జట్టు 18ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 136పరుగులు చేసి గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుపికి బెంగళూరు బౌలర్లు డివైన్(23/2), శోభన (2/27), ఫెర్రీ (16/3) కట్టడి చేశారు. దీంతో యుపి జట్టు 31పరుగులకే 5వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో గ్రేస్ హ్యారీస్(46), నవ్‌గైర్ (22) దీప్తి(22) బ్యాటింగ్‌లో రాణించడంతో యుపి జట్టు ఆ మాత్రమైనా స్కోర్ చేయగల్గింది. ఛేదనలో బెంగళూరు జట్టు 60 పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డట్లు కనిపించినా.. కనిక అహూజా(46), రీచా ఘోష్(31నాటౌట్), హీదర్ నైట్(24) రాణించి మ్యాచ్‌ను ముగించారు. ఈ గెలుపుతో బెంగళూరు జట్టు దాదాపు ప్లే-ఆఫ్ నుంచి నిష్క్రమించుకుందనుకున్న దశలో మళ్లీ రేసులోకి వచ్చింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఎలీసా ఫెర్రీకి లభించింది.

డబ్ల్యుపిఎల్‌లో నేడు..
ఢిల్లీ క్యాపిటల్స్ × గుజరాత్ జెయింట్స్
(వేదిక: బ్రాబౌర్న్ స్టేడియం, సమయం: రాత్రి 7.30గం॥లకు)

యుపి మహిళల ఇన్నింగ్స్: హీలీ (సి)శోభన (బి)సోఫీ డివైన్ 1, దేవిక వైద్య (ఎల్‌బి)సోఫీ డివైన్ 0, కిరణ్ నవ్‌గైర్ (సి)రీచా ఘోష్ (బి)శోభన 22, మెక్ గ్రాత్ (సి)రీచా ఘోష్ (బి)స్కట్ 2, గ్రేస్ హ్యారీస్ (సి)రీచా ఘోష్ (బి)ఎలీసా ఫెర్రీ 46, సిమ్రన్ షైక్ (సి)అహూజా (బి)శోభన 2, దీప్తి శర్మ (సి)శ్రేయాంక (బి)ఎలీసా ఫెర్రీ 22, శ్వేతా సెహ్రావత్ (బి)ఎలీసా ఫెర్రీ 6, ఎక్లేస్టోన్ (రనౌట్) దిశా కసత్ (బి)శ్రేయాంక 12, అంజలి శర్వాణి (సి)అహూజ (బి)శ్రేయాంక 8, గైక్వాడ్ (నాటౌట్) 2, అదనం 12. (19.3ఓవర్లలో ఆలౌట్) 135పరుగులు. **బౌలింగ్:** సోఫీ డివైన్ 4-0-23-2, స్కట్ 4-0-21-1, రేణుక సింగ్ 2-0-20-0, శోభన 4-0-27-2, ఎలీసా ఫెర్రీ 4-0-16-3, శ్రేయాంక 1.30-21-1.

బెంగళూరు మహిళల ఇన్నింగ్స్: సోఫీ డివైన్ (సి)మెక్ గ్రాత్ (బి)హ్యారీస్ 14, స్మృతి మంధాన (బి)దీప్తి శర్మ 0, ఎలీసా ఫెర్రీ (సి)ఎక్లేస్టోన్ (బి)దేవిక వైద్య 10, హీథర్ నైట్ (సి)కిరణ్ నవ్‌గైర్ (బి)దీప్తి శర్మ 24, కనిక అహూజా (బి)ఎక్లేస్టోన్ 46, రీచా ఘోష్(నాటౌట్) 31, శ్రేయాంక (నాటౌట్) 5, అదనం 6, (18ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 136పరుగులు. **బౌలింగ్:** హ్యారీస్ 3-0-28-1, దీప్తి శర్మ 4-0-26-2, రాజేశ్వరి 4-0-35-0, ఎక్లేస్టోన్ 4-0-20-1, దేవిక 2-0-19-1, అంజలి 1-0-4-0

రెండోరౌండ్‌కు శ్రీకాంత్

తొలిరౌండ్‌లోనే ఓడిన సింధు
ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ



లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లగా.. మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ పివి సింధు తొలిరౌండ్‌లోనే ఓటమిపాలైంది. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో మాజీ నంబర్‌వన్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ 19-21, 21-14, 21-5తో ఫ్రాన్స్‌కు చెందిన పొపోవ్‌పై చెమటోడ్చి నెగ్గాడు. ఇక పివి సింధు 17-21, 11-21తో చైనాకు చెందిన వై మింగ్ జంగ్ చేతిలో వరుస సెట్లలో ఓడింది. తొలిగేమ్‌లో పోరాడి ఓడిన సింధు.. రెండో గేమ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేక పోయింది. మహిళల డబుల్స్‌లో త్రీషా జోలీ-గాయత్రి గోపీచంద్ జోడీ 21-18, 21-14 తో థాయ్‌లాండ్‌కు చెందిన ప్రజోగ్నల్-కితిహరత్కూర్‌పై వరుససెట్లలో గెలిచి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. నేడు జరిగే రెండోరౌండ్ పోటీల్లో లక్ష్యసేన్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో, హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ గింటింగ్(ఇండోనేషియా)తో తలపడనున్నారు.

హార్దిక్‌కు పగ్గాలు..

తొలి వన్డేకు రోహిత్ దూరం



ముంబయి: ఆస్ట్రేలియాతో 17న జరిగే తొలి వన్డేకు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సారథ్య బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. వ్యక్తిగత కారణాలతో తొలి వన్డేకు అందుబాటులో ఉండలేనని రోహిత్ శర్మ బోర్డుకు తెలపడంతో హార్దిక్ జట్టుకు నాయకత్వం వహిస్తాడని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. వన్డే జట్టులో విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాలతో కూడిన భారతజట్టు పటిష్టంగానే కనిపిస్తోంది. ఇక శ్రేయస్ అయ్యర్ గాయపడడం టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మరోవైపు ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్‌లకు తుది జట్టులో చోటు దక్కడం ఖాయం. వాంఖడే స్టేడియంలో తొలుత బ్యాటింగ్‌కు దిగే జట్టు క్రీజ్‌లో నిలదొక్కుకునేందుకు చెమటోడ్చాల్సి ఉంటుంది. ఈ స్టేడియంలో భారత్-ఆస్ట్రేలియా జట్టు తలపడడం ఇది ఐదోసారి. అందులో మూడుసార్లు ఆసీస్, రెండుసార్లు భారత్ గెలిచాయి. ఈ వేదికపై 2020 జనవరిలో జరిగిన చివరి వన్డేలో ఆస్ట్రేలియా జట్టు 10వికెట్ల తేడాతో భారతజట్టుపై గెలిచింది. భారత్ తొలిగా బ్యాటింగ్‌కు దిగి 255పరుగులకు ఆలౌట్ కాగా.. ఆస్ట్రేలియా జట్టు వికెట్లేమీ నష్టపోకుండా 258పరుగులు చేసింది.

టాప్‌లోనే అశ్విన్

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా ర్యాంకింగ్స్‌లో భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఐసిసి బుధవారం విడుదల చేసి బౌలర్ల జాబితాలో అశ్విన్ అగ్రస్థానంలో నిలిచాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అశ్విన్ 17.28 యావరేజ్‌తో మొత్తం 25వికెట్లు సాధించాడు. గత వారం ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ ఆండర్సన్‌తో కలిసి టాప్‌లో నిలిచిన అశ్విన్.. తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విన్ ఒక్కడే అగ్రస్థానంలో నిలిచాడు. ఇక బ్యాటర్స్ జాబితాలో విరాట్ కోహ్లి ఏకంగా 7స్థానాలు మెరుగుపరచుకొని 13వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన నాల్గో టెస్ట్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి(186పరుగులు) సెంచరీ చేయడంతో అతని ర్యాంక్ మెరుగైంది. టెస్టుల్లో విరాట్ కోహ్లి 1205రోజుల తర్వాత సెంచరీని నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ బ్యాటర్స్ జాబితాలో 8స్థానాలు మెరుగుపరచుకొని 44వ స్థానంలో నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68